FOR ADS.......
ఆకాంక్ష
CONTACT:
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ... అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...

8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :197 | ఎడిటర్ : పెనగొండ సతీష్ | పేజీలు : 08, | వెల. 5రూ/ | సోమవారం- 09 - మార్చి - 2026

## టీటీడీ కొనుగోళ్ల వ్యవస్థలో సంపూర్ణ ప్రక్షాళన - 'డిజిటల్ ప్లాట్‌ఫాం'తో కల్తీ, నాసిరకాలకు చెక్



### సమీకృత డిజిటల్ ప్లాట్‌ఫాంను అభివృద్ధి చేసిన టీటీడీ

### ఎక్కడా అవకతవకలకు తావులేకుండా నెయ్యి, దినుసుల కొనుగోళ్లు

### ఇకపై ఏది కొనాలన్నా, విక్రయించాలన్నా ఈ ప్లాట్‌ఫాం ద్వారానే

అమరావతి : తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీ, నిత్యాన్నదానం కోసం వినియోగించే దినుసుల కొనుగోలు వ్యవస్థను టీటీడీ పూర్తిగా ప్రక్షాళించబోతోంది. గత ప్రభుత్వ హాయాంలో వెలుగుచూసిన కల్తీ నెయ్యి, నాసిరకం దినుసుల కొనుగోళ్ల కుంభకోణం నేపథ్యంలో ఇకపై ఎక్కడా అవకతవకలకు తావులేకుండా, పూర్తి పారదర్శకంగా చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగా నాణ్యమైన సరకుల్ని సరైన ధరలకు కొనుగోలు చేసేందుకు ఒక సమీకృత డిజిటల్ ప్లాట్‌ఫాంను అభివృద్ధి చేసింది. సంవత్సరం పొడవునా టీటీడీకి ఏ రకం దినుసులు, అలాగే అవి ఎంత పరిమాణంలో కావాలి? ఎప్పుడు, ఎంత కొనాలి? ఎంత నిల్వ ఉంచుకోవాలనే పూర్తి మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందించుకునేందుకు మిగతా..2లో

## సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు



### సింగపూర్ ఎయిర్ లైన్స్‌కు చెందిన ఓ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి.

### ఈ సంఘటన హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం చోటుచేసుకుంది.

హైదరాబాద్, మార్చి 8: సింగపూర్ ఎయిర్ లైన్స్‌కు చెందిన ఓ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ సంఘటన హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు మిగతా..2లో

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన నన్ను కలచివేసింది



2

- డార్జిలింగ్ సంతాల్ సదస్సు నిర్వహణ తీరుపై పవన్ కల్యాణ్ స్పందన
- రాష్ట్రపతి ఆవేదన భరిత వ్యాఖ్యలు తనను బాధించాయన్న డిప్యూటీ సీఎం
- సొంత సదస్సుకే సంతాల్ ప్రజలు రాలేకపోవడం దురదృష్టకరం
- రాష్ట్రపతి పర్యటనను హుందాగా నిర్వహించడంలో అధికార యంత్రాంగం విఫలం

అమరావతి : పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో జరిగిన 'అంతర్జాతీయ సంతాల్ సదస్సు' నిర్వహణ తీరు,

## పెళ్లి మండపంలో వరుడిని వదిలి

# ప్రియుడి దగ్గరకు వెళ్లిన పెళ్లికూతురు...

- జీలకర్ర బెల్లం తర్వాత వధువు సంచలన నిర్ణయం...
- పెళ్లిపీటలపై నుంచి లేచిన వధువు...
- ప్రియుడితోనే వెళ్తా" అంటూ షాక్...
- ఎన్టీఆర్ జిల్లాలో సినిమా సన్నివేశాన్ని తలపించిన ఘటన...



వివరాలు 2లో..



ఎన్టీఆర్ జిల్లా// మార్చి 8(ఆకాంక్ష ) : ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన ఒక పెళ్లి వేడుకలో అనూహ్య ఘటన చోటు చేసుకుని అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. జీలకర్ర బెల్లం పెట్టిన కొద్ది క్షణాల్లోనే పెళ్లి పీటలపై కూర్చున్న వధువు ఒక్కసారిగా లేచి మండపానికి వచ్చిన యువకుడి వద్దకు వెళ్లి నిలబడటం అక్కడ ఉన్నవారిని షాక్‌కు గురిచేసింది. తాను అతడినే ప్రేమిస్తున్నానని, అతడితోనే వెళ్లి పోతానని అందరి ముందే ప్రకటించడంతో పెళ్లి వేడుక ఒక్కసారిగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ పరిధిలోని వేర్వేరు గ్రామాలకు చెందిన యువతి, యువకుడికి పెద్దలు సంప్రదాయబద్ధంగా వివాహం నిశ్చయించారు. ఇరువురు కుటుంబాల పెద్దలు పరస్పరం మాట్లాడుకుని శుభముహూర్తం ఖరారు చేశారు. వరుడి స్వగ్రామంలోనే పెళ్లి వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణ మండపాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## ఆకాశంలో సగం కాదు...

# నింగీ నేలా మీరే

### మహిళలకు నారా లోకేశ్ శుభాకాంక్షలు

- మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్
- ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పిస్తే చంద్రబాబు పొదుపు సంఘాలు తెచ్చారని వెల్లడి
- పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చాగంటి కోటేశ్వరరావు నియామకం
- ఆడపిల్లలా ఏడవొద్దు.. గాజులు తొడుక్కోలేదు వంటి మాటలు మాట్లాడటం తప్పే
- సినిమాల్లో మహిళలను కించపరిచేలా ఉంటే ఊరుకోనని హెచ్చరిక



2లో

## రాష్ట్రపతి కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదు



2

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనపై రాజకీయ రగడ
- ప్రోటోకాల్ ఉల్లంఘన లేదని స్పష్టం చేసిన సీఎం మమతా బెనర్జీ
- రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వలేదని ఆరోపణ
- మమత రాజీనామా చేయాలని బీజేపీ నేతల డిమాండ్

## బ్లూ బుక్' నిబంధనలు

# పాటించలేదు

### బంగాల్ సర్కార్ కు కేంద్రం లేఖ

- రాష్ట్రపతి కార్యక్రమంలో ప్రోటోకాల్ లోపాలపై కేంద్రం తీవ్ర ఆక్షేపణ
- బ్లూ బుక్ నిబంధనలు ఉల్లంఘించారని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ
- సీఎం గైర్హాజరుపై రాష్ట్రపతి అసంతృప్తి



2లో

ఢిల్లీ : బంగాల్‌లో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా జరిగిన ప్రోటోకాల్ లోపాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో లోపాలను కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. ఏర్పాట్లపై వివాదం నెలకొనడంతో కేంద్ర ప్రభుత్వం బంగాల్ ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం

## ప్రపంచకప్ ఫైనల్లో

# భారత్ సునామీ

### న్యూజిలాండ్‌పై ఘన విజయం...

### అహ్మదాబాద్ వేదికగా చరిత్ర సృష్టించిన టీమ్ ఇండియా...




మార్చి 8(ఆకాంక్ష ) : అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా జరిగిన ఐసీసీ వీవఅ'ం ౨20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా నేషనల్ క్రికెట్ టీం అద్భుత ప్రదర్శనతో న్యూ న్యూజిలాండ్ నేషనల్ క్రికెట్ టీం పై భారీ విజయం సాధించి ప్రపంచ



వివరాలు 2లో..

ఛాంపియన్‌గా అవతరించింది. కోట్లాది భారత అభిమానుల ఆశలు నెరవేర్చుతూ టీమ్ ఇండియా మరోసారి ప్రపంచ క్రికెట్ వేదికపై తన ఆధిపత్యాన్ని చాటింది. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు భారత జట్టు పూర్తి

## రైతు సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉంది



2

- రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.
- రైతు సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

మెదక్, మార్చి 8: రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈరోజు(ఆదివారం)మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్, రైతుల వసతి గృహాన్ని బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూ. 1.50000 కోట్లు కేటాయించారని ప్రస్తావించారు.

## త్వరలోనే తెలంగాణలో

# ఉచిత స్కూటీలు

- విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ
- 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులు
- నగరంలోని డీజిల్ బస్సులు జిల్లాలకు తరలింపు
- ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్ విధానం
- ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థినులకు తీపి కబురు అందించారు. చదువుకునే ఆడబిడ్డల ప్రయాణ కష్టాలను తీర్చడంతో పాటు, వారిని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తరపున ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజాభవన్‌లో ఘనంగా జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం.. మహిళా సాధికారతకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. మిగతా..2లో

## ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట

### నేర్పు.. ఓర్పు.. విజయం.. మహిళల సొంతమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.

### లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలగా పని చేస్తూ మహిళలు విజయాలు సాధిస్తున్నారన్నారు.



2లో

హైదరాబాద్, మార్చి 08: నేర్పు.. ఓర్పు.. విజయం.. మహిళల సొంతమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలగా పని చేస్తూ మహిళలు విజయాలు సాధిస్తున్నారన్నారు. ఆదివారం నాడు బంజారాహిల్స్‌లోని కుమురం భీం ఆదివాసి భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సీతక్క ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా స్వయం సహాయక సంఘం సభ్యులకు 30 రకాల ఆరోగ్య పరీక్షలను ఈ సందర్భంగా వారు ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సెర్ప్ కుటుంబ సభ్యులకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించు కున్నామన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సి ంహతోపాటు వైద్య ఆరోగ్య శాఖకు ఆమె ధన్యవాదాలు చెప్పారు.

మొదటి పేజి తరువాయి

## బదిలీపై వెళ్తున్న జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్ భేటీ..

ఇక జిష్ణుదేవ్ వర్మతో జరిగిన భేటీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు. మరోవైపు బదిలీపై వెళ్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఇప్పటికే వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్నారు. మరికొద్ది రోజుల్లో ఆయన రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్.. తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కేంద్రం నియమించింది. అయితే ఆకస్మాత్తుగా గవర్నర్ పదవికి రాజీనామా చేయడంపై ఆనంద్ బోస్ వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. అదీకాక.. కేరళకు చెందిన ఆనంద్ బోస్.. తన ఓటును స్వరాష్ట్రం నుంచి పశ్చిమబెంగాల్ మార్చుకోవడం గమనార్హం. మరికొద్ది నెలల్లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. అలాంటి వేళ.. గవర్నర్ పదవికి ఆనంద్ బోస్ రాజీనామా హాట్ టాపిక్‌గా మారింది.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన నన్ను కలచివేసింది

అక్కడ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎదురైన పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ద్రౌపది ముర్ము, అక్కడి పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని, అవి తనను తీవ్ర ఆందోళనకు గురిచేశాయని పవన్ పేర్కొన్నారు. సంతాల్ సామాజిక వర్గం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఒక సదస్సును నిర్వహించినప్పుడు, అందులో ఆ వర్గానికి దక్కాల్సిన గౌరవం, ప్రాధాన్యత కచ్చితంగా ఉండాలని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఎవరి కోసమైతే ఈ సదస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేశారో, ఆ సంతాల్ కమ్యూనిటీకి చెందిన సభ్యులే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. ఇలాంటి సాంస్కృతిక సమావేశాలు అందరినీ కలుపుకుపోయేలా, సున్నితత్వంతో కూడిన పరిపాలనా ప్రణాళికతో జరగాలని హితవు పలికారు. ముఖ్యంగా భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి అని, ఆ పదవికి, ఆ వ్యవస్థకు ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం దక్కాలని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలని, అది ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం బాధ్యత అని స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటనలో ప్రొటోకాల్, మర్యాదలకు భంగం వాటిల్లడం సరికాదన్నారు. భారతదేశ అస్తిత్వంలో, మన దేశ ఖ్యాతిలో గిరిజన సమాజాలు అంతర్భాగమని పవన్ కల్యాణ్ కొనియాడారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, వారి గళానికి ఎల్లప్పుడూ నిజాయతీతో కూడిన గౌరవం లభించాలన్నారు. గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా, రాజ్యాంగ అధిపతికి అసౌకర్యం కలిగించేలా జరిగిన ఈ సంఘటన దురదృష్టకరమని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా పాలకులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## బ్లూ బుక్‘ నిబంధనలు పాటించలేదు

5 గంటలలోగా సమాధానం ఇవ్వాలని కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. బంగాల్ ముఖ్య కార్యదర్శికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాసిన లేఖలో రాష్ట్రపతి ముర్ము పర్యటన సమయంలో భద్రత, ప్రోటోకాల్, వేదిక ఏర్పాట్లు, మార్గ ఏర్పాట్లలో జరిగిన ఉల్లంఘనలపై పూర్తి వివరణ కోరారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, వారి కుటుంబ సభ్యుల భద్రతకు సంబంధించిన నియమాలు వివరించే గోప్య పత్రం అయిన బ్లూ బుక్ నిబంధనలు పాటించలేదని కేంద్రం అభిప్రాయపడింది.

రాష్ట్రపతి అసంతృప్తి

సిలిగుడి సమీపంలోని బాగ్‌డోగ్రా విమానాశ్రయం వద్ద శనివారం జరిగిన గిరిజన సమాజ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము పాల్గొన్నారు. అయితే ఆ కార్యక్రమానికి తక్కువ సంఖ్యలో ప్రజలు హాజరుకావడం, ఏర్పాట్లు సరిగా లేకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా కార్యక్రమం వేదికను ముందుగా నిర్ణయించిన బిధన్నగర్ నుంచి గోషాయిపుర్ ప్రాంతానికి మార్చడం సరైన నిర్ణయం కాదని ప్రశ్నించారు. “కార్యక్రమం బిధన్నగర్‌లో జరిగి ఉంటే మరింత మంది పాల్గొనేవారు. అక్కడ విస్తారమైన స్థలం ఉంది. కానీ ఎందుకు అక్కడ అనుమతి ఇవ్వలేదో నాకు తెలియదు. ఇక్కడికి ప్రజలు రావడం కష్టంగా ఉంది“ అని ఆమె వ్యాఖ్యానించారు. అలాగే తన పర్యటన సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, రాష్ట్ర మంత్రులు ఎవరూ హాజరు కాకపోవడాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. “మమతా బెనర్జీ నా చిన్న చెల్లెల్లాంటివారు. నేను కూడా బంగాల్ కూతురినే. ఆమె ఎందుకు రాలేదో తెలియదు. కానీ అది పెద్ద విషయం కాదు. మీ అందరూ సంతోషంగా ఉండాలి“ అని రాష్ట్రపతి అన్నారు.

## త్వరలోనే తెలంగాణలో ఉచిత స్కూటీలు

ఎన్నికల హామీ మేరకు... త్వరలోనే ఈ ఉచిత స్కూటీల పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు, గృహలక్ష్మి పథకం ద్వారా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇవ్వడం ద్వారా వారి విద్యకు, స్వావలంబనకూ మరింత తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు కాలుష్య విముక్తి

నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు మరో భారీ నిర్ణయాన్ని సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో కాలుష్యమే పెద్ద అడ్డంకిగా మారిందని, ఇది నాన్ లివింగ్ సిటీగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. డిసెంబర్ 9వ తేదీలోపు నగరంలో డీజిల్ బస్సులు కనిపించవని, ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులన్నింటినీ జిల్లాలకు తరలిస్తామని తెలిపారు. నగర ప్రజల కోసం ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు. అంతేకాకుండా, నగరంలో తిరిగే పెట్రోల్, డీజిల్ ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తామని చెప్పారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తే ‘జీరో ట్యాక్స్‘ విధిస్తామని, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను వెలుపలికి తరలిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట: సీతక్క

మహిళలకంటూ ఒకరోజు ఉండాలని ఐక్యరాజ్యసమితి 1975లో గుర్తించిందని గుర్తు చేశారు. ఇంతకు ముందు ఒక సోషలిస్టు జర్మనీ నాయకురాలు క్లారా జేట్కిన్ మహిళల సమస్యల మీద పోరాటాలు చేశారని వివరించారు. కర్మాగారాల్లో మహిళలకు వేతనాలు స్వల్పంగా ఉండేవన్నారు. కనీసం ఓటు హక్కు కూడా మహిళలకు లేదని చెప్పారు. కానీ మహిళలు పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకున్నారని వివరించారు. అవకాశం ఇస్తే అంతరిక్షంలోకి వెళ్తారని మహిళలు నిరూపించారన్నారు. కుటుంబాలు, పంట పొలాల నుంచి అంతరిక్షం వరకూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. పంట పొలాల్లో 80 శాతం పని మహిళలే చేస్తారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయాలని సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. వినూత్న వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతున్న మహిళా సంఘాలను ఈ రోజు సన్మానించుకున్నామని చెప్పారు. వారు తెలంగాణ మహిళా సమాజానికి ఆదర్శప్రాయులని తెలిపారు. మహిళలు అందరి గురించి ఆలోచిస్తారు.. కానీ తమ గురించి ఆలోచించే సమయం వారికి దొరకదన్నారు. అందుకే మహిళలకు ఆరోగ్యంగా పని చేసే శక్తి ఉండేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆడ పిల్లలు ఉన్నారని గుర్తు చేశారు. అందుకే వారికి ఆడవారి ఇబ్బందులు తెలుసునన్నారు. కాబట్టి మనకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. లోన్ బీమాతోపాటు ప్రమాద బీమాతో వారికి భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా లోన్‌లు ఇప్పించి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు.

## రైతు సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉంది

ఆరోగ్యవంతమైన సమాజం తయారు కావాలంటే సేంద్రీయ వ్యవసాయం కొనసాగించాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయంతోనే ఆరోగ్య దేశం సాకారమవుతుందని తెలిపారు. దేశంలో 60 కోట్ల మంది రైతులు ఉండగా.. రాష్ట్రంలో 60 లక్షల మంది ఉన్నారని ప్రస్తావించారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు

చెందిన ఎస్క్యూ 519 విమానం శనివారం ఉదయం 155 మంది ప్రయాణీకులతో సింగపూర్ వెళ్లడానికి సిద్ధమైంది. ఉదయం 10.55 గంటలకు విమానం టేకాఫ్ కావాల్సి ఉంది. ప్రయాణీకులు బోర్డింగ్ గేట్ వద్ద విమానం ఎక్కడానికి సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి సమయంలో విమానంలో బాంబులు ఉన్నాయంటూ గుర్తు తెలియని వ్యక్తి ఎయిర్‌పోర్టు భద్రతాధికారులకు ఈ మెయిల్ పంపాడు. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. విమానాన్ని ఎయిర్ సైడ్ అధికారులు ఐసోలేషన్‌కు తరలించి తనిఖీలు చేశారు. అయితే, ఎలాంటి బాంబులు విమానంలో దొరకలేదు. దాదాపు 13 గంటల తర్వాత విమానం సింగపూర్ బయలుదేరింది. ఈ సంఘటనపై జీహెచ్ఏఎల్ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### కొద్దిరోజుల క్రితం కూడా..

ఫిబ్రవరి 14వ తేదీన సింగపూర్ - హైదరాబాద్ విమానానికి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. సదరు విమానాన్ని సురక్షితంగా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యేలా చర్యలు చేపట్టారు. ప్రయాణికులను దింపిన అనంతరం.. ఆ విమానాన్ని ఖాళీ టెర్మినల్ వద్దకు తరలించి తనిఖీలు చేపట్టారు. విమానంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో.. ప్రయాణికులతో పాటు ఎయిర్ పోర్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఆకాశంలో సగం కాదు... నింగీ నేలా మీరే

మొదటి పేజి తరువాయి



అమరావతి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా మహిళల త్యాగాలను, శక్తిని కొనియాడుతూ ఓ ఆసక్తికరమైన సందేశాన్ని విడుదల చేశారు. “అమ్మా.. నీవు ఆకాశంలో సగం కాదమ్మా.. నింగీ నేలా నీవే. ఈ సృష్టి మీది.. మా జన్మ మీది“ అంటూ మహిళల ప్రాధాన్యతను లోకేశ్ గొప్పగా వర్ణించారు. అమ్మ, భార్య, సోదరి, కుమార్తె, పిన్ని, మరదలు ఇలా ప్రతి రూపంలోనూ మనల్ని కంటికి రెప్పలా కాపాడే మాతృమూర్తులందరికీ వందనాలు సమర్పించారు. ఈ సందర్భంగా తన కుటుంబం, పార్టీ మహిళల కోసం చేసిన కృషిని లోకేశ్ గుర్తుచేశారు. మహిళలను గౌరవించాలనే నైతిక విలువలను తన తల్లి చిన్నప్పుడే నేర్పించారని, దివంగత ఎన్టీఆర్ ఆడపడుచులకు ఆస్తిహక్కు కల్పిస్తే.. తన తండ్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం ‘స్త్రీ శక్తి‘, ‘తల్లికి వందనం‘ వంటి పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తోందని, ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. భావితరాల్లో మహిళల పట్ల గౌరవం పెంచేందుకు విద్యావ్యవస్థలో కీలక మార్పులు చేశామని లోకేశ్ వెల్లడించారు. నైతిక విలువల సలహాదారుగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమించి, వారి సూచనలతో పాఠ్యాంశాల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో స్త్రీ, పురుషులను సమానంగా చూపే చిత్రాలనే ముద్రించామన్నారు. సమాజంలో తరచూ వినిపించే “ఆడపిల్లలా ఏడవొద్దు“, “గాజులు తొడుక్కోలేదు“, “చీర గాజులు పంపిస్తా“ వంటి మాటలు ఎవరు మాట్లాడినా తప్పేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మహిళలను కించపరిచే భాష, సన్నివేశాలు ఉండకూడదని తాను పోరాడుతున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళామూర్తుల సహనానికి, శక్తికి లోకేశ్ పాదాభివందనం చేశారు.

## పెళ్లి మండపంలో వరుడిని వదిలి ప్రియుడి దగ్గరకు వెళ్లిన పెళ్లికూతురు...

మొదటి పేజి తరువాయి



బంధుమిత్రులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సంప్రదాయ వాద్యాల నడుమ పెళ్లి వేడుకలు కోలాహలంగా కొనసాగాయి. వధూ వరులు సంప్రదాయ దుస్తుల్లో పెళ్లి పీటలపై కూర్చుని పండితులు చెప్పిన విధంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పురోహితులు మంత్రోచ్చారణల మధ్య వివాహ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు.ముహూర్త సమయం దగ్గర పడడంతో జీలకర్ర బెల్లం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆచార ప్రకారం వధూ వరులు ఒకరికి ఒకరు జీలకర్ర బెల్లం పెట్టుకున్నారు.పెళ్లి వేడుకలో ఆ క్షణం అత్యంత ముఖ్యమైనదిగా భావించబడుతుంది.అక్కడివరకు అన్నీ సజావుగానే కొనసాగుతున్నట్లు కనిపించింది. అయితే అదే సమయంలో పెళ్లి మండపం వద్దకు వచ్చిన ఓ యువకుడిని వధువు గమనించింది. అతడిని చూసిన వెంటనే వధువు ఒక్కసారిగా లేచి నిలబడి అతని వైపు నడిచి వెళ్లింది.పెళ్లి పీటలపై నుంచి లేచి వెళ్లిన వధువు “ఇప్పటికైనా వచ్చావా” అంటూ ఆ యువకుడి దగ్గరకు వెళ్లి నిలబడింది. ఈ హఠాత్పరిణామంతో అక్కడ ఉన్న బంధువులు, అతిథులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పెళ్లి కార్యక్రమం జరుగుతున్న వేళ ఇలా జరగడంతో అందరూ అయోమయానికి గురయ్యారు.కొంతసేపు ఏమి జరుగుతుందో అర్థం కాక అందరూ ఒకరినొకరు చూస్తూ నిలిచిపోయారు. పెళ్లి కార్యక్రమం వెంటనే ఆగిపోయింది. వధువు ఇలా ఎందుకు ప్రవర్తిస్తోందని కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. అప్పుడు వధువు అసలు విషయాన్ని అందరి ముందే వెల్లడించింది. మండపానికి వచ్చిన యువకుడే తన ప్రియుడని తెలిపింది. అతను తమ గ్రామానికి చెందినవాడేనని, చాలా కాలంగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నామని చెప్పింది. తనకు అతడితోనే జీవితం గడపాలని ఉందని, అతడినే పెళ్లి చేసుకుంటానని స్పష్టంగా ప్రకటించింది. తాను ఈ పెళ్లి చేయలేనని చెప్పడంతో అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యానికి గురయ్యారు.ఈ మాటలు విన్న వరుడి కుటుంబ సభ్యులు తీవ్ర నిరాశకు గురయ్యారు. పెళ్లి ఏర్పాట్లకు భారీగా ఖర్చు చేసిన నేపథ్యంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొందరు బంధువులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.మండపానికి వచ్చిన యువకుడిపై కొందరు దాడికి దిగేందుకు ప్రయత్నించారు.దీంతో పెళ్లి మండపంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. బంధువుల మధ్య తోపులాట చోటుచేసుకుంది.ఈ ఘటనతో పెళ్లి వేడుక పూర్తిగా ఆగిపోయింది. వధువు నిర్ణయంతో వరుడు, అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా నిరాశ చెందారు. మండపంలో ఉన్న అతిథులు ఈ ఘటనను చూసి ఆశ్చర్యపోయారు. కొంత సేపటికి పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో అక్కడి నుంచి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే కల్యాణ మండపానికి చేరుకున్నారు.పోలీసులు ఇరువర్గాల వారిని శాంతింపజేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. యువకుడిని అక్కడి నుంచి సురక్షితంగా తరలించారు. ఇరువర్గాల కుటుంబ సభ్యులతో మాట్లాడి వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించే ప్రయత్నం చేశారు.ఈ ఘటన స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. పెళ్లి వేడుకకు హాజరైన బంధుమిత్రులు ఈ సంఘటనను సినిమా సన్నివేశంలా ఉందంటూ వ్యాఖ్యానించారు.జీలకర్ర బెల్లం పెట్టిన కొద్ది క్షణాల్లోనే పెళ్లి ఇలా నిలిచిపోవడం అక్కడ ఉన్నవారిని ఆశ్చర్యానికి గురిచేసింది. పెళ్లి పీటలపై కూర్చున్న వధువు అకస్మాత్తుగా లేచి వెళ్లడం ఎవరూ ఊహించలేదు. స్థానికంగా ఈ ఘటనపై ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ప్రేమ వ్యవహారం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని తెలుస్తోంది.ఇక ఈ సంఘటనపై పోలీసులు మరింత సమాచారం సేకరిస్తున్నారు. ఇరువర్గాల కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ప్రపంచకప్ ఫైనల్లో భారత్ సునామీ

మొదటి పేజి తరువాయి

ఆధిపత్యం చూపించడంతో ఫైనల్ పోరు ఏకపక్షంగా మారింది.ప్రపంచ క్రికెట్ అభిమానులందరూ ఆసక్తిగా ఎదురు చూసిన ఈ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని భారీ స్టేడియంలో ఘనంగా జరిగింది. స్టేడియం మొత్తం నిండిన ప్రేక్షకులు భారత జట్టు ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. మ్యాచ్ ప్రారంభం నుంచే ఉత్కంఠ నెలకొనగా, మైదానంలో ప్రతి క్షణం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.టాస్ గెలిచిన న్యూజిలాండ్ జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత్ మొదట బ్యాటింగ్‌కు దిగింది. ప్రారంభం నుంచే భారత ఓపెనర్లు దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును వేగంగా ముందుకు తీసుకెళ్లారు. పవర్‌ప్లేలోనే బౌండరీలు, సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తీసుకువచ్చారు.భారత బ్యాటింగ్‌లో ముఖ్యంగా సంజు శాంసన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆత్మవిశ్వాసంతో ఆడిన ఆయన ప్రతి బంతిని ధైర్యంగా ఎదుర్కొంటూ బౌండరీలు, సిక్సర్లతో స్టేడియాన్ని ఉర్రూతలూగించాడు. కేవలం 46 బంతుల్లో 89 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు.ఇక అభిషేక్ శర్మ కూడా వేగంగా ఆడుతూ జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. తక్కువ బంతుల్లోనే అర్ధశతకం సాధించి న్యూజిలాండ్ బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. ఆయన దూకుడు కారణంగా భారత స్కోరు వేగంగా పెరిగింది. మరోవైపు ఇషాంత్ కిషన్ కూడా దూకుడైన ఇన్నింగ్స్ ఆడి జట్టుకు మరింత బలం చేకూర్చాడు. వేగంగా పరుగులు సాధిస్తూ ప్రత్యర్థి బౌలర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టాడు. ఆయన ఇన్నింగ్స్ భారత స్కోరును మరింత భారీగా మార్చింది.మధ్య ఓవర్లలో న్యూజిలాండ్ బౌలర్లు కాస్త ప్రతిఘటన చూపించారు. ముఖ్యంగా జేమ్స్ నీశం ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు తీసి మ్యాచ్‌ను కాస్త ఆసక్తికరంగా మార్చాడు. అయితే భారత బ్యాట్స్‌మెన్లు ఒత్తిడిని తట్టుకుని మళ్లీ దూకుడు పెంచారు.చివరి ఓవర్లలో శివమ్ దూబే అద్భుతంగా ఆడుతూ తక్కువ బంతుల్లోనే వేగంగా పరుగులు సాధించాడు. ఆయన దూకుడు కారణంగా భారత జట్టు స్కోరు భారీ స్థాయికి చేరుకుంది. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 255 పరుగులు చేసి భారీ లక్ష్యాన్ని న్యూజిలాండ్ ముందుంచింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు ప్రారంభం నుంచే ఒత్తిడిలో పడింది. భారత బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్లను నిలువరించారు. ప్రారంభ ఓవర్లలోనే కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారు.న్యూజిలాండ్ తరఫున టైమ్ సీఫర్ట్ కొంత ప్రతిఘటన చూపిస్తూ అర్ధశతకం సాధించాడు. కానీ ఇతర బ్యాట్స్‌మెన్లు భారత బౌలర్లను ఎదుర్కోలేక వరుసగా వికెట్లు కోల్పోయారు.భారత ప్రధాన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేస్తూ కీలక వికెట్లు తీశాడు. ఆయన బౌలింగ్ కారణంగా న్యూజిలాండ్ మిడిల్ ఆర్డర్ పూర్తిగా కుదేలైంది. ప్రతి ఓవర్‌లో ఒత్తిడి పెంచుతూ ప్రత్యర్థి జట్టును నిలువరించాడు. అలాగే అక్షర్ పటేల్ మరియు వరుణ్ చక్రవర్తి స్పిన్ బౌలింగ్‌తో కీలక వికెట్లు తీసి న్యూజిలాండ్ జట్టును కుదిపేశారు. భారత ఫీల్డర్లు కూడా అద్భుతంగా ఫీల్డింగ్ చేస్తూ క్యాచ్‌లు పట్టారు.దీంతో న్యూజిలాండ్ జట్టు పరుగులు సాధించడంలో పూర్తిగా విఫలమైంది. వరుసగా వికెట్లు పడిపోవడంతో వారి ఇన్నింగ్స్ కుప్పకూలింది. చివరికి న్యూజిలాండ్ జట్టు 143 పరుగులకే పరిమితమైంది.భారత జట్టు భారీ తేడాతో విజయం సాధించి ప్రపంచ కప్‌ను తన ఖాతాలో వేసుకుంది. మ్యాచ్ ముగిసిన వెంటనే స్టేడియంలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. భారత ఆటగాళ్లు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.ప్రేక్షకులు జాతీయ జెండాలను ఊపుతూ “ఇండియా ఇండియా” నినాదాలతో స్టేడియాన్ని మార్మోగించారు. దేశవ్యాప్తంగా కూడా అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. సోషల్ మీడియా అంతా భారత విజయ వార్తలతో మార్మోగింది.ఈ విజయంలో భారత బ్యాట్స్‌మెన్ల దూకుడు కీలక పాత్ర పోషించింది. అదే సమయంలో బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి జట్టును నిలువరించారు. ఫీల్డింగ్‌లో చూపిన చురుకుదనం కూడా మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపు తిప్పింది.ఈ విజయంతో భారత జట్టు ప్రపంచ క్రికెట్ చరిత్రలో మరో గొప్ప అధ్యాయాన్ని రాసింది. కోట్లాది అభిమానుల ఆశలు నెరవేర్చిన ఈ విజయం దేశానికి గర్వకారణంగా నిలిచింది. టీమ్ ఇండియా మరోసారి ప్రపంచ వేదికపై తన శక్తిని నిరూపించి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది.

## ముర్మునే మాత్రమే కాకుండా దేశాన్ని, రాజ్యాంగాన్ని అవమానించింది బంగాల్ సర్కార్

మొదటి పేజి తరువాయి

తెలిపారు. “దేశం అంతా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో, రాష్ట్రపతికి తగిన గౌరవం ఇవ్వకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం మాత్రమే కాదు, దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య విలువలకు జరిగిన అవమానం“ అని ప్రధాని అన్నారు. ఇక మహిళా సాధికారత దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లక్షపతి దీదీ కార్యక్రమాన్ని ప్రధాని ప్రస్తావించారు. కొన్ని సంవత్సరాల క్రితం మూడు కోట్ల మహిళలను లక్షపతి దీదీలుగా తీర్చిదిద్దుతామని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అప్పట్లో చాలామంది దీనిని రాజకీయ హామీగా తీసుకున్నారని, అయితే ఇప్పుడు ఆ లక్ష్యాన్ని సాధించామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా మూడు కోట్లకు పైగా మహిళలు లక్షపతి దీదీలుగా ఎదిగారని మోదీ తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత దేశ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలపడుతున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అపారమని, సమాజాన్ని ముందుకు నడిపించడంలో వారు కీలక శక్తిగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు దేశానికి కొత్త శక్తిని అందిస్తూ అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ అభివృద్ధిపై కూడా ప్రధాని మాట్లాడారు. ఏడాది క్రితం ఢిల్లీ ప్రజలు కొత్త ఆశలు, సంకల్పంతో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటి నిర్ణయం ఫలితంగా రాజధానిలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఢిల్లీలో రూ.33,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. అలాగే కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. నగర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే మెట్రో విస్తరణ పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై కూడా ప్రధాని విమర్శలు చేశారు. గత దశాబ్దంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రాజెక్టులు ఫైళ్లలోనే నిలిచిపోయాయని ఆరోపించారు. ఆప్ ప్రభుత్వాన్ని ఆపద ప్రభుత్వంగా పేర్కొంటూ, ప్రజల సమస్యల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. “ఢిల్లీకి ఏడాది క్రితం వచ్చిన ఆపద నుంచి విముక్తి చాలా అవసరం. ఆ ప్రభుత్వం లేకపోతే మెట్రో ఫేజ్-4 ప్రాజెక్టు చాలా ముందే పూర్తయ్యేది. కానీ గత ప్రభుత్వం పనులు చేయకుండా సాకులు చెప్పడానికే పరిమితమైంది“ అని మోదీ విమర్శించారు. ప్రస్తుతం ఢిల్లీలో అభివృద్ధి పనులు మిషన్ మోడ్‌లో జరుగుతున్నాయని తెలిపారు. యమునా నది శుభ్రత కోసం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంతో లక్షల వాహనాలు నగరంలోకి రావాల్సిన అవసరం తగ్గిందని వివరించారు. మెట్రో విస్తరణతో తూర్పు, ఈశాన్య ఢిల్లీ ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగవుతుందని ప్రధాని తెలిపారు. అలాగే గాజియాబాద్, నోయిడా, ఫరీదాబాద్, గురుగ్రామ్ వంటి ఎన్సీఆర్ నగరాలకు ప్రయాణం సులభతరం అవుతుందని చెప్పారు.

## రాష్ట్రపతి కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదు

మొదటి పేజి తరువాయి



ఢిల్లీ : బంగాల్‌లో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన వివాదం రాజకీయంగా మరింత వేడెక్కింది. రాష్ట్రపతి కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణలో ఏమైనా లోపాలు ఉంటే వాటికి ప్రైవేట్ నిర్వాహకులు, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె అన్నారు. అయితే పర్యటనలో అవమానం జరిగిందని ఆరోపిస్తూ బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రోటోకాల్ ఉల్లంఘన లేదన్న మమత కోల్ కతాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడిన మమతా బెనర్జీ, రాష్ట్రపతి కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని చెప్పారు. దేశంలో రాష్ట్రపతి పదవికి, రాజ్యాంగానికి తాము ఎప్పుడూ గౌరవం ఇస్తామని తెలిపారు. అలాగే కార్యక్రమానికి సంబంధించిన అన్ని వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయలేదని ఆమె ఆరోపించారు. ప్రైవేట్ నిర్వాహకులు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో చెత్త సమస్య, గ్రీన్ రూమ్ లోపాలు, మహిళల కోసం సరైన టాయిలెట్లు లేకపోవడం వంటి సమస్యలు ఉంటే వాటికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించదని స్పష్టం చేశారు.

ప్రధాని ఫోటో చూపించిన మమత

ఈ సందర్భంగా మమతా బెనర్జీ ఒక ఫోటోను చూపిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఆ ఫోటోలో ప్రధాని నరేంద్ర మోదీ కూర్చుని ఉండగా రాష్ట్రపతి నిలబడి ఉన్నారని ఆమె పేర్కొన్నారు. “మేం రాష్ట్రపతిని అవమానించే సంస్కృతి కలిగినవారు కాదు. రాష్ట్రపతిని అవమానించే సంస్కృతి బీజేపీదే“ అని ఆమె వ్యాఖ్యానించారు. తాము ఎప్పుడూ రాజ్యాంగాన్ని తల్లిగా భావిస్తామని కూడా ఆమె అన్నారు. ఈ వివాదాన్ని రాజకీయంగా మలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలుచేయాలనే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.

సీఎం రాజీనామా చేయాలన్న బీజేపీ

ఇక ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ ఎంపీ ఖగేన్ ముర్ము మాట్లాడుతూ, రాష్ట్రపతిని అవమానించినందుకు ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సమాజ గౌరవాన్ని కాపాడాలంటే సీఎం పదవి నుంచి తప్పుకోవాలని ఆయన అన్నారు. కేవలం క్షమాపణ చెప్పడం సరిపోదని కూడా వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి బంగాల్‌ను వ్యక్తిగత రాజ్యంలా పాలిస్తున్నారని, బాద్‌షాలా వ్యవహరిస్తున్నారని కూడా ఆయన విమర్శించారు.

టీఎంసీపై మరోసారి విమర్శలు

బీజేపీ జాతీయ ప్రతినిధి సీఆర్ కేశవన్ కూడా ఈ అంశంపై స్పందించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా జరిగిన ఘటనను అవమానకరమైన వ్యవహారంగా ఆయన పేర్కొన్నారు. సంతాలి అంతర్జాతీయ సదస్సుకు మొదట నిర్ణయించిన ప్రాంగణానికి అనుమతి ఇవ్వకుండా టీఎంసీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రపతి పట్ల ఈ విధమైన ప్రవర్తన ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. ఆదివాసీ సమాజానికి చెందిన తొలి మహిళా రాష్ట్రపతిపై జరిగిన ఈ ఘటన దేశాన్ని బాధించిందని పేర్కొన్నారు. అలాగే ప్రతిపక్ష నాయకులు కూడా ఈ అంశంపై మౌనం పాటిస్తున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎంకేస్టాలిన్ వంటి నేతలు స్పందించాలని ఆయన కోరారు. మొత్తంగా రాష్ట్రపతి పర్యటనపై బంగాల్‌లో రాజకీయ

# సంపాదకీయం

## ఇది మహిళా పోరాట దినం!

మార్చి 8 అనగానే దాని పోరాట స్ఫూర్తిని మహిళలకు అందించడం కాకుండా దానిని కొంతమంది కేవలం శుభాకాంక్షల రోజుగా దిగజార్చారు. ఈ నేపథ్యంలో గ్రామీణ భారతదేశంలో మహిళల జీవనాధారంగా నిలిచిన 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ భారతదేశంలో పేదలు, దళితులు, మహిళలు జీవనోపాధి కోసం ఎక్కువగా ఆధారపడే పథకం ఇది. సంవత్సరానికి కనీసం వంద రోజుల పనిని హామీ ఇస్తూ, పల్లెల్లోనే ఉపాధి కల్పించడం ద్వారా ఈ పథకం లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చింది. ముఖ్యంగా మహిళల భాగస్వామ్యం ఈ పథకంలో గణనీయంగా పెరిగింది. పల్లెల్లో మహిళలు స్వయంగా పనికి వెళ్లి సంపాదించడం వల్ల వారి కుటుంబాల్లో నిర్ణయాధికారం పెరిగింది. అప్పుల బానిసత్వం కొంతవరకు తగ్గింది. వలసల ఒత్తిడి కూడా తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంఎన్ఆర్ఈజీఏను బలహీనపరచడం, దానికి బదులుగా వీబీ జీ రామ్ జీ పథకాన్ని తీసుకురావడం వంటివి గ్రామీణ సమాజంలో అనిశ్చితి కలిగిస్తున్నాయి. నిజానికి వ్యవసాయరంగంలోని మహిళల స్థితిగతులు పరిశీలించి, అసమానతలను తొలగించడానికి ప్రపంచ ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 2026ను అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ముఖ్యంగా మూడో ప్రపంచ దేశాల్లో ఆహార ఉత్పత్తుల్లో పాల్గొంటున్న వారిలో 60 నుంచి 80శాతం వరకూ మహిళలే ప్రధాన భాగస్వామిగా ఉంటున్నారు. అయితే భూ యాజమాన్యంలో స్త్రీ పురుషుల మధ్య తీవ్ర అంతరాలు కొనసాగుతున్నాయి. ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటున్న మహిళలు 80శాతం మంది వ్యవసాయ రంగంలోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని హామీలు ఇచ్చినా ఎన్ని చట్టాలు చేసినా భూ కమతాలపై యాజమాన్యం, అధికారం పురుషులదే అవుతోంది. చట్టాలు కూడా వారికే అనుకూలంగా ఉన్నాయి. సొంత భూ కమతాలు ఉన్నవారు మహిళల్లో 8 నుంచి 14శాతం మాత్రమే ఉన్నారు. వ్యవసాయ రంగంలో పురుషుల కంటే ఎక్కువగా శ్రమిస్తున్న మహిళా రైతులు, రైతు కూలీలకు నేటికీ న్యాయం జరగట్లేదు. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు రక్షించుకోవడానికి పోరాటాలే స్ఫూర్తిగా తీసుకోవాలనేది ఈ మార్చి 8 పిలుపులో మరో ముఖ్యమైన అంశం. మహిళల హక్కుల చరిత్రను చూస్తే ఒక స్పష్టమైన నిజం మనకు కళ్ళకు కనబడుతుంది. ఏ హక్కూ స్వయంగా దానధర్మంగా రాలేదు. ప్రతి హక్కూ పోరాటాల ద్వారానే సాధ్యమైంది. సమాజంలో సమానత్వం కోసం మహిళలు సాగించిన ఉద్యమాలు అనేక చట్టాలకు పునాది అయ్యాయి. వరకట్న నిరోధం నుంచి గృహహింస నిరోధం వరకు, పని స్థలాల్లో లైంగిక వేధింపుల నివారణ నుంచి క్రిమినల్ చట్టాల్లో మార్పుల వరకు ప్రతి చట్టం వెనుక మహిళల నిరంతర పోరాటాల చరిత్ర ఉంది. అయినా, మహిళల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఇన్ని చట్టాలు ఉన్నా మహిళలు ఎందుకు ఇంకా రోడ్డెక్కి పోరాడాల్సి వస్తోంది? అంటే, ప్రభుత్వాలు చట్టాలు చేయడం ఒక్కటే సరిపోదు. అవి సక్రమంగా అమలయ్యేవిధంగా చూడాలి. ఈ బాధ్యత ప్రభుత్వానిదే. చట్టాలు వచ్చినప్పటికీ మహిళల జీవన స్థితిగతులు పూర్తిగా మారలేదు. గ్రామీణ ప్రాంతాల్లో, పేద వర్గాల్లో మహిళలకు న్యాయం జరగడం ఇంకా కష్టసాధ్యంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో మహిళల ఉద్యమాలు మరింత తీవ్రతరం కావాల్సిన అవసరం పెరుగుతోంది. మహిళల సమాన హక్కుల కోసం సాగుతున్న ప్రతి ఉద్యమమూ మన సమాజానికి ఒక చైతన్యాన్ని అందిస్తుంది. న్యాయం కోసం, హక్కుల కోసం మన మహిళల పోరాటం ఇంకా ముగియలేదు.

# ఏఐ... సమానత్వానికి ఎంత దూరం?




ప్రతి మహిళా దినోత్సవమూ లింగ సమానత్వాన్ని చర్చకు పెడుతుంది. అది సాధించడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో లెక్కలు కట్టి చెబుతుంటారు సామాజికవేత్తలు. ఇవి ఏఐ రోజులు కదా, రియల్ వరల్డ్ సంగతి పక్కన పెట్టి ఒకసారి రేపటి ప్రపంచానికి పునాది వేస్తున్న కృత్రిమ మేధలో మహిళల పరిస్థితి ఏంటో చూద్దామా? ఇవాళా రేపూ ఏ పని కావాలన్నా ఏఐని అడగడం ఫ్యాషన్ కదా. అలాగే ఒక పరిశోధక బృందం కొన్ని స్త్రీ పురుషుల పేర్లూ అర్హతలు ఇచ్చి వాళ్లకు ఉద్యోగ రికమండేషన్ లెటర్లు రాసిపెట్టమని రెండు ఎల్ఎల్ఎం(చాట్‌జీపీటీ లాంటివి)లను అడిగింది. అవి ఇచ్చిన ఉత్తరాలను పరిశీలిస్తే... పురుషుల గురించి చెప్పేటప్పుడు- నాయకుడు, రోల్‌మోడల్, అనుభవజ్ఞుడు, ఆలోచనాపరుడు, గౌరవనీయుడు, ఇంటెగ్రిటీ, ఆథెంటిక్, మాస్టర్... లాంటి వ్యక్తిత్వాన్ని తెలిపే విశేషణాలు వాడాయి. అదే స్త్రీలకోసం రాసిన లేఖల్లో- బ్యూటీ, గ్రేస్, స్టన్నింగ్ లాంటి అందానికి పర్యాయ పదాలను; వార్మ్, ఎమోషనల్ లాంటి స్వభావాన్ని తెలిపే పదాలను వాడాయి. పురుషులు ఎంత ఎదిగినా స్త్రీల భుజాలను దాటి పైకి చూడలేరన్నారు ఒక కవి, స్త్రీల మేధస్సును గుర్తించలేరని ఆక్షేపిస్తూ. ఇరవై ఒకటో శతాబ్దపు అద్భుతమైన ఏఐ కూడా అంతకుమించి ఎదిగేలా లేదు. లింగ సమానత్వం కోసం వందేళ్లకు పైగా సాగుతున్న పోరాటం ఇంకా ఒక కొలిక్కే రాలేదు. ఇక, ఇప్పుడు మిషన్లతోనూ పోరాడక తప్పని పరిస్థితి అన్నమాట! పెద్ద మొత్తంలో అందుబాటులో ఉన్న టెక్ట్స్, ఇమేజెస్, వీడియో కంటెంట్‌ని ప్రాసెస్ చేసి భవిష్యత్తును నిర్మిస్తుంది జనరేటివ్ ఏఐ. ఇన్నాళ్లూ ఆ పనిలో పురుషులే ఎక్కువగా ఉన్నారు. ఫలితంగా పురుష పక్షపాతం ఏఐలోకీ చేరింది. స్త్రీల పట్ల నిర్లక్ష్యం, వివక్ష ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. 2023లో ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ న్యూస్ కవరేజ్‌ని విశ్లేషించినప్పుడు- టాప్ 100 ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్స్‌లో ఉన్న 42 మంది మహిళలందరిదీ కలిపి ఎన్నిసార్లు వచ్చిందో దానికి రెట్టింపుసార్లు ఒక్క సామ్ ఆల్ట్‌మన్ పేరు వచ్చిందట. గ్లోబల్ మీడియా మానిటరింగ్ ప్రాజెక్ట్ ప్రకారం సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణలు, అభివృద్ధికి నిధులు కేటాయించడం లాంటి విషయాలకు సంబంధించి మహిళల ప్రస్తావన కేవలం నాలుగు శాతం వార్తల్లోనే ఉంది. అలాగని ఏఐలో మహిళలు లేరా అంటే... కొన్నిచోట్ల పురుషులను మించి ఉన్నారు!

### ఘోస్ట్ వర్క్ మహిళలదే

తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీల్లాంటివారు ఏఐ ప్రపంచం వెనకా ఉన్నారు. డెవలపర్స్, న్యూస్‌ఎడిటర్స్, ఏఐ ఎక్స్‌పర్ట్స్... లాంటి కీలకమైన హోదాల్లో మహిళలు చాలా తక్కువే కానీ 'ఘోస్ట్ వర్కర్స్'గా గుర్తింపు లేని పనిచేస్తున్నది మాత్రం మూడొంతులు వారే. ఏఐ డేటా ఎన్నొటేషన్‌కి గ్లోబల్ హబ్‌గా మారిన మనదేశంలో 2030 నాటికి పదిలక్షల మంది ఎన్నొటేటర్స్ ఉంటారని అంచనా. ప్రస్తుతం దాదాపు నాలుగు లక్షలమంది ఈ పని చేస్తుండగా వారిలో అత్యధికులు మహిళలు. వీరంతా గ్రామీణ ప్రాంతాలకు, అణగారిన వర్గాలకు చెందిన తొలితరం గ్రాడ్యుయేట్లు. మెట్రో నగరాలకు దూరంగా చిన్న పట్టణాల్లో ఉన్న ఈ కేంద్రాల్లో సొంతూళ్లో ఉద్యోగం దొరుకుతోందన్న ఆశతో ఎందరో యువతులు చేరుతున్నారు. టెక్ట్స్, ఫొటోలు, వీడియోలు లాంటి కంటెంట్ చూసి అది ఎలాంటి తరహాదో లేబుల్ చేయడం వీరి పని. వినడానికి చాలా చిన్న పనే అనిపిస్తుంది. టెక్ట్స్, ఫొటోలూ కొంతవరకు పర్వాలేదు, సమస్యంతా వీడియోలతోనే. ఒక్కొక్కరూ రోజుకు 800 దాకా చూడాలి. వాటిల్లో చాలా వరకూ అశ్లీలం, లైంగిక దాడులు, పిల్లల మీద లైంగిక హింస, గ్రాఫిక్ వయొలెన్స్, ఘోరప్రమాదాలకు సంబంధించినవే ఉంటాయి. ఇంటర్నెట్‌లో ఉన్న డార్క్‌ఫీడ్ అంతా చూసి ప్రపంచానికి 'క్లీన్ ఫీడ్' దొరికేలా చేస్తున్న ఈ మహిళలు మానసికంగా నరకాన్ని అనుభవిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. మనసును కలచివేసే దృశ్యాలను గంటల తరబడి చూడటం వల్ల పనిచేసే షిఫ్ట్ అయిపోయినా కళ్లలో అవే దృశ్యాలు కదులుతూ ఉంటాయి. నిద్రపట్టదు. క్రమంగా వారి మెదడు మొద్దుబారిపోయి దేనికీ స్పందించలేని స్థితికి వచ్చేస్తున్నారు. అనుబంధాలూ దెబ్బతింటున్నాయి. మానసిక ఆరోగ్యపరంగా వీరికి సాయమూ అందడం లేదు. కంటెంట్ మోడరేషన్ అనేది ప్రమాదకరమైన పనికిందే వస్తుందంటారు సామాజికవేత్తలు. కానీ మన కార్మిక చట్టాల్లో మానసిక హానికి గుర్తింపు లేదు.

### ఆశలన్నీ ఆ సొల్యూషన్స్‌పైనే!

ఏఐ సిస్టమ్స్ అన్నీ డేటా మీద ఆధారపడి పనిచేస్తాయి. దానికి అందే డేటా పక్షపాతంతో ఉంటే ఏఐ దాన్ని పునరావృతం చేయడమే కాదు, పెంచుతుంది కూడా. ఇప్పటికే వర్ధమాన దేశాల్లో డిజిటల్ అంతరాలు ఎక్కువ. వాటిని అధిగమించాలంటే వివక్షను దాటి ఏఐ మహిళల సాధికారతకు తోడ్పడాలి. ఈ దిశగా అంతో ఇంతో ఆశ రేకెత్తిస్తోంది 'కేస్‌బుక్ ఆన్ ఏఐ అండ్ జెండర్ ఎంపవర్‌మెంట్'. ఇటీవల దిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో దీన్ని విడుదల చేశారు. ఇండియా ఏఐ మిషన్ ఆధ్వర్యంలో యూఎన్ విమెన్ సహకారంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 23 రియల్ వరల్డ్ ఏఐ సొల్యూషన్స్‌తో రూపొందింది. 50 దేశాల నుంచి వచ్చిన 233 పత్రాలను పరిశీలించి వీటిని ఎంపిక చేశారు. లింగసమానత్వానికి, మహిళా సాధికారతకు ఏఐ ఎలా ఉపయోగపడుతుందో ఇవి చెబుతున్నాయి. వైద్యం, ఆర్థికం, డిజిటల్ సేఫ్టీ, విద్య, న్యాయం... లాంటి కీలక రంగాలను ఈ ఏఐ సొల్యూషన్స్ కవర్ చేస్తున్నాయి. విధానకర్తలకు, పరిశోధకులకు, ఆవిష్కర్తలకు ఏఐ సిస్టమ్స్‌లో బాధ్యతాయుత లింగసమానత్వ సూత్రాలను సమ్మిళితం చేయడానికి ఇది ప్రాక్టికల్ గైడ్‌బుక్‌లాగా ఉపయోగపడుతుంది. స్టెమ్ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా డిజిటల్ జెండర్ డివైడ్‌ని తగ్గించడానికి తోడ్పడుతుంది. ఏఐ అందరికీ సమానంగా ఉపయోగపడేదే అయినా మహిళలు దానికి దూరంగా ఉండటానికి కారణం- వారు దాన్ని ఆసక్తికరమైన కొత్త టెక్నాలజీగా చూడటంలేదు. తమను వేధించడానికి, ఆన్‌లైన్ నుంచి తమను దూరం చేయడానికి వచ్చిన మరో కొత్త శత్రువుగా భావిస్తున్నారు. జెండర్ రెస్పాన్సివ్ ఏఐ ఆచరణలోకి వస్తేనే ఈ పరిస్థితి మారుతుందనీ భవిష్యత్తు బాగుంటుందనీ ఆశ.

# గణపతి లొంగిపోతారా



ఎప్పుడా అంటూ దేశమంతా ఎదురుచూసిన ఆ క్షణం రానే వచ్చిందనుకున్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మావోయిస్టుల భారీ లొంగుబాట్లు ఉంటాయని మీడియాకు సమాచారం వచ్చిన వెంటనే ఊహాగానాలు మొదలయ్యాయి. సీఎం సమక్షంలో అంటున్నారు కనుక తప్పనిసరి ఆ దళపతి ఉంటాడనుకున్నారు. తీరా చూస్తే 130 మంది వివిధ స్థాయిలకు చెందిన నక్సలైట్లు 124 వివిధ రకాల ఆయుధాలతో లొంగిపోయారు. కానీ ఆ సుప్రీం జాడే లేదు. కొండపల్లి సీతారామయ్య తర్వాత అంతటి పేరు ప్రఖ్యాతులు గాంచిన ఆ మనిషి వెంటనే జనజీవన స్రవంతిలోకి రావాలని రేవంత్ సైతం పిలుపునిచ్చారు. ఆయన వస్తే, ప్రాణాలకు భద్రత కల్పిస్తామని, ఆరోగ్యాన్ని కాపాడుతామని హామీ ఇచ్చారు. ఇంతకీ అందరూ ఎదురు చూసిన మావోయిస్టు మాజీ దళపతి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు ఎందుకు లొంగిపోలేదు అసలు ఆయన ఎక్కడున్నారు నేపాల్‌లో ఉన్నారా ఇండియాలోనే ఉన్నారా కొన్ని మీడియాల్లో వచ్చినట్లు ఆయన ఆనుపానులు తెలంగాణ ఎస్ఐబీకి తెలిసిపోయాయా వారి అదుపులోనే ఉండి అరెస్టు చూపడం కాకుండా లొంగుబాటుకు ఒప్పించే ప్రయత్నంలో జాప్యం జరుగుతున్నదా అందులో భాగంగానే అమెరికాలో ఉన్న ఆయన కుమారుడి చేత "నాన్నా.. ఒక్కసారి కనిపించవా.." అంటూ ఆడియో విడుదల చేయించారా లేదంటే.. ఆయన గురించి వస్తున్న వార్తలన్నీ వట్టి మీడియా ఊహాగానాలేనా నేపాల్‌లోనో, మరే దేశంలోనో ఆయన రహస్యంగా ఉన్నారా మన దేశంలోనే ఏదో ఒక నగరంలో లేక మారుమూల చిన్న పట్టణంలో స్థిరపడ్డారా అమిత్ షా పెట్టిన డెడ్‌లైన్ 2026 మార్చి 31 వరకూ సైలెంట్‌గా ఉండి ఆ తర్వాత అసలు నిజాలు కుండ బద్దలు కొడతారా ఇవన్నీ జవాబివ్వలేని ప్రశ్నలు..

### ఒక కొండపల్లి సీతారామయ్య.. ఒక గణపతి

లొంగుబాటు సభలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు.. కొండపల్లి సీతారామయ్యకు ఎంతటి పేరు ప్రఖ్యాతులు వచ్చాయో, అంతకన్నా ఎక్కువ పాపులారిటీ సంపాదించిన నేత గణపతి. బీఎడ్ వరకూ చదివి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా కొంతకాలం ఉద్యోగం చేసిన ఆయన గొప్ప మేధావి. గ్రౌండ్ లెవెల్లో ఒక ఏరియా సెంట్రల్ ఆర్గనైజర్‌గా పనిచేసి జగిత్యాల జైత్రయాత్రలో రైతాంగాన్ని సమీకరించిన ఆచరణవాది. భారతదేశంలో విప్లవోద్యమం ఉన్న అన్ని రాష్ట్రాలనూ, ప్రాంతాలనూ తిరిగిన అనుభవశీలి. శ్రీకాకుళ పోరాటం ఓటమి పాలై విప్లవ శ్రేణులు నిరాశ నిస్పృహల్లో మునిగివున్న వేళ.. ఎమర్జెన్సీ అనంతరం తెలంగాణలో ఉద్యమాన్ని నిర్మించి పీపుల్స్ వార్ పార్టీని స్థాపించి, నడిపించిన గొప్పనేత కొండపల్లి. వయసు తెచ్చిన అనారోగ్యంతో అదే కొండపల్లి సీతారామయ్య ఉద్యమంతో సజీవ సంబంధాలు తెగిపోయిన, పొలిటికల్ బ్యాలన్స్ కోల్పోయిన పరిస్థితుల్లో పగ్గాలు చేపట్టి ఉద్యమాన్ని 18 రాష్ట్రాలకు విస్తరింపజేసి ఐక్య మావోయిస్టు పార్టీని నిర్మించిన మరో గొప్పనేత గణపతి. ఆయన నాయకత్వంలోనే పీఎల్జీఏ ఏర్పాటు జరిగింది. దక్షిణ బస్తర్, అబూజ్మాడ్, సరండా వంటి ప్రాంతాలు గెరిల్లా స్థావరాలుగా మారాయి. జిల్లా స్థాయి జనతన సర్కార్లు ఏర్పడి పాలించాయి. కొండపల్లికి మించిన ఫీల్డు అనుభవం, ప్రజల చైతన్య స్థాయిలను అంచనా వేసి, ఆచరణను సిద్ధాంతానికి మేళవించే సామర్థ్యం గణపతి సొంతం.

### లొంగిపోతే అదొక హిస్టారికల్ వండర్..

అలాంటి గణపతి.. ఒక సోనూలా, ఒక దేవ్‌జీలా ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం అంటే.. నిజంగానే అది ఒక హిస్టారికల్ వండర్ అవుతుంది. మారిన సామాజిక-ఆర్థిక-రాజకీయ పరిస్థితుల్లో దీర్ఘకాలిక సాయుధ పోరాటం ఆచరణ సాధ్యం కానిదని కనుక ఆయన నమ్మితే.. ఉద్యమం వ్యూహాత్మక వెనకడుగులో ఉందని సీసీ అంచనా వేసిన 2018 కాలంలోనే మొత్తం పార్టీ వ్యూహం-ఎత్తుగడలను మార్చడానికి పూనుకునేవారు. ఇప్పుడు సోనూ చెబుతున్నట్లుగా మావోయిస్టు పార్టీని లీగలైజ్ చేసి చట్టబద్ధ ఉద్యమాలను నిర్మించేవారు. సీసీ నేరుగా కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈశాన్య రాష్ట్రాల్లో జరిగినట్టుగా శాంతి ఒప్పందం కుదుర్చుకుని జనజీవన స్రవంతిలోకి వచ్చేవాళ్లు. అప్పుడు అనేక మంది నేతలు, కేడర్లు చనిపోవడం, ఆ తర్వాత ఆయుధాలతో, ఆయుధాలు లేకుండా మూకుమ్మడిగా లొంగిపోవడం జరిగేదే కాదు.

### కార్యదర్శి మార్పు ఎందుకు జరిగింది

కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న గణపతికి 2018లో ఆరోగ్య కారణాలతో విశ్రాంతినిచ్చి, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జిగా ఉన్న బసవరాజును నియమించడం వెనక ఏం జరిగింది? ఈ విషయంలో కూడా అనేక ఊహాగానాలున్నాయి. పీపుల్స్ వార్ పార్టీతో ఎంసీసీ కలిసిన తర్వాత మిలిటరీకి ప్రాధాన్యం పెరిగిందని, రాజకీయాలు, పార్టీ నిర్మాణం రెండవ స్థానానికి వచ్చాయని విశ్లేషకులు అంటున్నారు. ఎంసీసీ వర్గం మద్దతుతోనే బసవరాజు నియామకం జరిగిందని వాళ్ల అభిప్రాయం. "2024 నవంబర్‌లో ముగ్గురు పొలిట్‌బ్యూరో సభ్యులం కలిశామని, అప్పుడు నేను పంథా మార్పు గురించి వాదించానని" లొంగిపోయిన సోనూ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. బసవరాజు దాన్ని వ్యతిరేకించాడని, గణపతి మౌనంగా ఉన్నాడని ఆయన అన్నారు. అంటే గణపతి ఏ అభిప్రాయంతో ఉన్నట్లు? దీర్ఘకాలిక సాయుధ పోరాట పంథా విఫలమైందనే అభిప్రాయంతో ఉన్నారా? లేదా పాత లైనుకే కట్టుబడి ఉన్నాం

### ఫీల్డుకు దూరంగా..

కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత గణపతి.. పార్టీ అంతర్జాతీయ వ్యవహారాల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అమృత్ పేరుతో పలు ప్రకటనలు కూడా విడుదల చేశారు. అంటే ఆయనకు దండకారణ్యం, తెలంగాణ, జార్ఖండ్, ఏఓబీ లాంటి పలు ఉద్యమ ప్రాంతాలతో డైరెక్ట్ కనెక్షన్ తెగిపోయింది. మధ్య భారత ఉద్యమాన్ని మొత్తం కార్యదర్శి బసవరాజే చూశారు. అయినప్పుడు లొంగిపోయిన కేడర్ల నుంచి గణపతి ఆచూకీ దొరకడం అసంభవమనే చెప్పవచ్చు. ఆయన వ్యక్తిగత సిబ్బంది, కొరియర్లకు తప్ప మరొకరికి ఆయన ఆనుపానులు తెలిసే అవకాశమే లేదు. అయినప్పుడు తెలంగాణ పోలీసుల అదుపులో ఉన్న వార్తలను నమ్మవచ్చా?

### రాజిరెడ్డి, దేవ్‌జీల లొంగుబాటుతోనే ఈ గందరగోళం

అయితే, సోనూ, ఆశన్నలు ఆయుధాలతో లొంగిపోయిన అనంతరం వారిపై ద్రోహులన్న ముద్ర వేసి పేపర్ ప్రకటనలు ఇచ్చిన సీసీ సభ్యుల్లో గణపతి మినహా అందరూ (చంద్రన్న, సుజాతక్క, మల్లా రాజిరెడ్డి, దేవ్‌జీ తదితరులు) ఈ మధ్య కాలంలో లొంగిపోవడం, రాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశమవడం మూలంగా గణపతి లొంగుబాటు వార్తలను మీడియా స్పెక్యులేట్ చేసింది. ప్రజలు నమ్మారు. అసలు పంథాను కొనసాగిస్తారనుకున్న వర్గం లొంగుబాటు మూలంగా మొత్తం పార్టీయే చట్టబద్ధ మార్గానికి వచ్చిందన్న సంకేతాలు వెళ్లాయి. ఫలితంగా దిశ సహా ప్రధాన స్రవంతి మీడియా అంతా గణపతి లొంగుబాటు వార్తలను ప్రచురించింది.

### మార్చి 31లోగా గణపతి లొంగుబాటు పక్కానా

అమిత్ షా డెడ్‌లైన్ ఈ నెల 31లోగా గణపతి సహా మిగిలివున్న అందరు మావోయిస్టు నేతలు, సభ్యులు లొంగిపోతారని ప్రస్తుతం పౌర సమాజంలోని మెజారిటీ నమ్ముతోంది. ఇప్పటికీ రేపో, మాపో, 10 రోజులకో, నెలాఖరుకో గణపతి లొంగుబాటు పక్కా అని వాదించేవాళ్లు కోకొల్లలు. ఆయన లొంగిపోతేనే దేశంలో మావోయిస్టు శకానికి ముగింపు పలకవచ్చని అటు మోడీ ప్రభుత్వం కూడా ప్రణాళికలు రచిస్తోంది. మరి ఏం జరగనుంది గణపతి లొంగిపోతారా లేక అంతా సద్దుమణిగాక సంచలన ప్రకటనతో బాంబు పేలుస్తారా కాలమే సమాధానమివ్వగలదు.

# ప్రైవేటు బిల్లుతో 42% రిజర్వేషన్లు సాధ్యమా?

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు అత్యంత కీలకమైన సంస్థ. దేశానికి అవసరమైన చట్టాలను రూపొందించడం పార్లమెంటు ప్రధాన బాధ్యత. పార్లమెంటులో బిల్లులను రెండు విధాలుగా ప్రవేశపెడతారు. ఒకటి ప్రభుత్వం ప్రవేశపెట్టే గవర్నమెంట్ బిల్లు, మరొకటి మంత్రివర్గంలో లేని సభ్యులు ప్రవేశపెట్టే ప్రైవేట్ మెంబర్ బిల్లు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 107 ప్రకారం పార్లమెంట్ సభ్యుడు ఎవరైనా బిల్లును ప్రవేశపెట్టే హక్కు కలిగి ఉంటారు. పార్లమెంటరీ చరిత్రను పరిశీలిస్తే..ప్రైవేట్ మెంబర్ బిల్లులు చట్టాలుగా మారడం చాలా అరుదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం 14 ప్రైవేట్ మెంబర్ బిల్లులు మాత్రమే చట్టాలుగా మారాయి. వాటిలో చివరిది 1970లో సుప్రీంకోర్టు క్రిమినల్ న్యాయ పరిధిని పెంచే బిల్లు ఆమోదం పొందింది. ఆ తర్వాత దాదాపు ఐదు దశాబ్దాలుగా వేలాది ప్రైవేట్ మెంబర్ బిల్లులు పార్లమెంటులో ప్రవేశపెట్టినా ఒక్కటి కూడా చట్టంగా మారలేదు. అంటే ప్రభుత్వ మద్దతు లేకుండా ప్రైవేట్ మెంబర్ బిల్లు చట్టంగా మారే అవకాశాలు దాదాపు లేవని చెప్పవచ్చు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే, తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు ప్రైవేట్ మెంబర్ బిల్లుతో సాధ్యమని కాంగ్రెస్ నేతలు చెప్పడం రాజకీయ ప్రకటనగా కనిపిస్తున్నది.

### 50% రిజర్వేషన్ పరిమితి సుప్రీంకోర్టు తీర్పు

దేశంలో రిజర్వేషన్లపై 50% పరిమితిని సుప్రీంకోర్టు 'ఇందిరా సహానీ కేసు' (1992)లో విధించింది. ఈ తీర్పు ప్రకారం సాధారణ పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50% మించకూడదు. అందువల్ల ఏ రాష్ట్రమైనా 50%కు మించి రిజర్వేషన్లు అమలు చేయాలంటే సాధారణ చట్టం సరిపోదు. ఈ పరిస్థితిలోనే తమిళనాడు ప్రభుత్వం 69% రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చించడం ద్వారా న్యాయపరమైన రక్షణ పొందింది. అప్పటి నుంచి తమిళనాడులో 69% రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి.

### తెలంగాణలో 42% రిజర్వేషన్ల హామీ

ఎన్నికల ముందు 2023 నవంబర్‌లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చట్టబద్ధంగా అమలు చేస్తామని ప్రకటించింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కులగణన నిర్వహించి, కమిషన్ సిఫార్సుల ఆధారంగా శాసనసభ, శాసనమండలిలో బిల్లును ఆమోదింపజేసింది. గవర్నర్ ఆమోదం తర్వాత ఆ బిల్లును 2025 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వానికి పంపింది. దీనిని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని కోరింది. ఆ ప్రతిపాదన కేంద్రం వద్ద పెండింగ్‌లోనే ఉన్నది. కేంద్రంలో బిల్లు పెండింగ్‌లో ఉండగానే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో జీవో నంబర్ 9 ద్వారా 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది. అయితే ఇది చట్టపరంగా నిలబడదని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరమ్ హెచ్చరించింది. తర్వాత జరిగిన పరిణామాలు కూడా అదే విషయాన్ని నిరూపించాయి. ఆ జీవోను హైకోర్టు నిలిపివేసింది. ఫలితంగా పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు 42% రిజర్వేషన్లు లేకుండానే నిర్వహించారు.

### ప్రైవేట్ మెంబర్ బిల్లు వాస్తవిక మార్గమా?

ఇటీవలి కాలంలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్‌లో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టి 42% రిజర్వేషన్ల అంశాన్ని సాధిస్తామని ప్రకటిస్తున్నారు. అయితే పార్లమెంటరీ చరిత్రను చూస్తే ఇది అమలయ్యే అవకాశాలు చాలా తక్కువ. ప్రైవేట్ మెంబర్ బిల్లులు సాధారణంగా చర్చలకు మాత్రమే పరిమితమవుతాయి. కేంద్ర ప్రభుత్వం మద్దతు లేకుండా అవి చట్టాలుగా మారడం దాదాపు అసాధ్యం. ముఖ్యంగా రాజ్యాంగ సవరణ వంటి కీలక అంశాల్లో ప్రైవేట్ మెంబర్ బిల్లుకు విజయావకాశాలు మరింత తక్కువ. అందువల్ల సమస్యను హైలైట్ చేయడానికి లేదా ప్రజల దృష్టిని ఆకర్షించటానికి మాత్రమే ప్రైవేట్ మెంబర్ బిల్లు ఉపయోగపడవచ్చు, కానీ అది పార్లమెంటులో చట్టంగా మారే అవకాశాలు చాలా స్వల్పం.

### చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ చేయాల్సింది ఏమిట

## పోలీస్ శాఖలో మహిళల సేవలు ప్రశంసనీయం...

పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్...



ఓదెల//**మార్చి 08 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు సిబ్బందిని సన్మానించి వారి సేవలను ప్రశంసించారు.కార్యక్రమంలో మహిళా పోలీసు కానిస్టేబుళ్లు రజిత, సుష్మిత, ధనలక్ష్మిలను పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. మహిళా పోలీసుల సేవాభావం, నిబద్ధతను కొనియాడుతూ వారికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల భద్రతకు కీలకంగా నిలుస్తున్నారని అన్నారు. కఠిన పరిస్థితుల్లో కూడా ధైర్యంగా విధులు నిర్వర్తిస్తూ శాఖకు మంచి పేరు తీసుకొస్తున్న మహిళా పోలీసులను ఆయన ప్రశంసించారు.ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళా పోలీసుల కష్టపడి చేసే సేవల వల్ల మహిళల భద్రతతో పాటు చట్టాల పరిరక్షణ మరింత బలపడుతోందని ఆయన అన్నారు. మహిళల సేవాభావం, కర్తవ్యనిష్ఠను గుర్తిస్తూ వారిని సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని ఎస్సై పేర్కొన్నారు. మహిళా సిబ్బంది సేవలను గుర్తించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కిషన్, పోలీసు సిబ్బంది శంకర్, రాజేందర్, రాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ మహిళా పోలీసుల సేవలకు గుర్తింపుగా నిలిచింది.

## నారాయణపేట జిల్లాలో విషాదం...

కరెంటు షాక్‌తో యువరైతు మృతి...



నారాయణపేట//**మార్చి 08 (ఆకాంక్ష) :** నారాయణపేట జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మాగనూరు మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన ఓ యువరైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. గ్రామస్తులను కలచి వేసిన ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట గ్రామానికి చెందిన యువరైతు బచ్చి దేవప్ప (32) రాత్రి తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలంలో ఉన్న బోరు మోటార్ స్టార్టర్‌లో కరెంటు సమస్య ఏర్పడటంతో దాన్ని సరిచేయడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో అనుకోకుండా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తీవ్ర కరెంటు షాక్ కారణంగా దేవప్ప అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.అయితే రాత్రి పొలానికి వెళ్లిన దేవప్ప తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పలుమార్లు వెతికినా కనిపించకపోవడంతో అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు ఉదయం పొలానికి వెళ్లి చూడగా దేవప్ప విగతజీవిగా పడి ఉండటం గమనించారు. ఈ దృశ్యం చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు.మృతుడు దేవప్పకు భార్యతో పాటు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబానికి ఏకైక ఆధారంగా ఉన్న దేవప్ప మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ఈ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఇబ్బందుల్లో పడింది.ఈ ఘటనతో అచ్చంపేట గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. దేవప్ప కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకుని ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు, బంధువులు కోరుతున్నారు. స్థానికులు ఈ ఘటనపై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

## మహిళా శక్తికి నిదర్శనం...

శృతిరెడ్డి ని సన్మానించిన ఎమ్మెల్యే, కలెక్టర్...




అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2026
08 - మార్చి - 2026
ప్రశంసాపత్రము
శ్రీమతి/కుమారి శృతి రెడ్డి, మేనేజర్, ఇండియన్ బ్యాంక్, కర్నూలు గారికి
మహిళాశక్తికి నిదర్శనంగా, మహిళా అభ్యున్నతికి మీరు చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేయడం మాకు గర్వకారణం. మీ ప్రతిభ, పట్టుదల మరియు నిరంతర కృషి సమాజంలోని ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా మీ భవిష్యత్తు ప్రయాణం మరింత విజయవంతంగా సాగాలని మేము ఆశిస్తున్నాము.
అభినందనలతో....
డా॥ ఎ. సిరి

వెల్దుర్తి //**మార్చి 08 (ఆకాంక్ష) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కర్నూలు ఇండియన్ బ్యాంకు మేనేజర్ శృతిరెడ్డి కి ఉత్తమ సేవలకు గాను ప్రశంసపత్రం అందజేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మరియు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి చేతుల మీదుగా ఆమెకు ప్రశంసపత్రం ప్రదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీమతి శృతిరెడ్డి మహిళా శక్తికి నిదర్శనంగా నిలుస్తూ బ్యాంకింగ్ రంగంలో విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు.మహిళల అభ్యున్నతికి కృషి చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆమె ప్రతిభ, పట్టుదల, కృషి మరెంతో మంది మహిళలకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మరియు కలెక్టర్ ఆధ్వర్యంలో శ్రీమతి శృతిరెడ్డి కి శాలువ కప్పి ప్రశంసపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు.కాగా శ్రీమతి శృతిరెడ్డి బోయనపల్లి గ్రామ సర్పంచ్ నర్సింగ్ శివజ్యోతి కోడలు కావడం విశేషం.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధికారులు, బ్యాంకు సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ భువన గాయత్రి మాత ఆలయంలో నూతన శిఖర ప్రారంభం...

కలశ ప్రతిష్ట, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట...



వెల్దుర్తి//**మార్చి 08 (ఆకాంక్ష) :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం అయిన వెల్దుర్తి మండల కేంద్రంలోని జాతీయ రహదారి44 సమీపంలో ఉన్న శ్రీ భువన గాయత్రి మాత ఆలయంలో నూతన శిఖర ప్రారంభోత్సవం, కలశ ప్రతిష్ట, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయ పీఠాధిపతి బాలకృష్ణ ఆచారి స్వామి ఆధ్వర్యంలో ఈ పుణ్యకార్యాలు శాస్త్రోక్తంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, మంత్రోచ్చారణలతో కూడిన వేద కార్యక్రమాలు నిర్వహించి భక్తుల మధ్య కలశ ప్రతిష్ట, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ వేడుకలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమాన్ని భువన గాయత్రి ఫౌండేషన్ సభ్యులు జూలకంటి రఘునాథ్ రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మీ సరోజ, ఐరన్ షాప్ రాము, రమణాచలం, హరినాథ్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు లలిత పీఠాధిపతులు సుబ్రహ్మణ్యం స్వామి, శివ జీవైక్య మఠాధిపతి ఎల్లప్ప స్వామి, వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్వాహకులు రామాంజనేయులు స్వామి, బొమ్మిరెడ్డి పల్లె భీమా శంకర ఆలయ నిర్వాహకులు లక్ష్మీ రెడ్డి పాల్గొన్నారు.అలాగే శ్రీమతి స్వయం ప్రభ, హరిసింహనాయుడు, చక్రపాణి రెడ్డి, నార్లపురం రామాంజనేయులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కూడా ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు ప్రసాదాలు అందజేశారు.ఈ పుణ్యకార్యాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడగా, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ప్రతిష్ట కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి.భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని నిర్వాహకులు కోరారు.

## మొండి పుండ్లకు జెల్ చికిత్స! - తాజా అధ్యయనంలో కీలక విషయాలు!

### పుండు మానడంలో ఆక్సిజన్‌దది కీలక పాత్ర

### పరిశోధకులు ఏం చెప్తున్నారంటే!



ఎంతకీ మానని మొండి పుండ్లు పెద్ద సమస్య. వీటికి చికిత్స చేయటం చాలా కష్టం. ఒకవేళ పుండ్లు మానకపోతే పాదాలు, వేళ్లు తొలగించాల్సిన పరిస్థితీ తలెత్తుతుంది. రోజు రోజుకీ వృద్ధులు, డయాబెటిస్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొండి పుండ్ల కొత్త చికిత్సలకూ ప్రాధాన్యం ఏర్పడుతోంది. దీని విషయంలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, రివర్‌సైడ్ (ఖజ=) రూపొందించిన జెల్ పట్టీ వ్యవస్థ కొత్త ఆశలు రేపుతోంది. గాయమైన చోట లేదా పుండ్లు ఉన్న చోట నిరంతరం ఆక్సిజన్ సరఫరా చేయటం ద్వారా పుండ్లు మానేలా చేయటం దీని ప్రత్యేకత. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

ఆక్సిజన్ పాత్ర :

మామూలుగా నాలుగు వారాల్లోపు నయం కాని పుండ్లను మొండిపుండ్లుగా భావిస్తుంటారు. ఈ రకం పుండ్లు నెలల కొద్దీ మానకుండా వేధిస్తుంటాయి. వీటితో ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావటం, హాస్పిటల్ లో చేరాల్సి రావటం వంటి జరుగుతుంటాయి. కొన్ని సార్లు కాళ్లూ, చేతుల వంటివి తొలగించాల్సిన పరిస్థితీ కూడా ఏర్పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 1.2 కోట్ల మంది మొండి పుండ్ల బారినపడుతున్నారని నివేదికలు అంచనా వేస్తున్నాయి. వీరిలో సుమారు 20 శాతం మందికి పాదాలు, వేళ్ల వంటివి తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నాయి. పుండ్లు మానకపోవటానికి ఒక ప్రధాన కారణం.. ఆ భాగానికి తగినంతగా, స్థిరంగా ఆక్సిజన్ అందకపోవటమే అంటున్నారు నిపుణులు. సాధారణంగా పుండు 4 దశలు ద్వారా మానుతుంటున్నారు నిపుణులు. ముందు వాపు ప్రక్రియ తలెత్తుతుందని, ఆ తర్వాత కొత్త రక్తనాళాలు పుట్టుకొస్తాయని పేర్కొంటున్నారు. అనంతరం కణజాలం తిరిగి కుదురుకుంటుందని తెలియజేస్తున్నారు. ఆఖరికి కొత్త కణజాలం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని దశల్లోనూ ఆక్సిజన్ పాత్ర కీలకమంటున్నారు. ఆక్సిజన్ తగినంత అందకపోతే వాపు ప్రక్రియ ఎక్కువ కాలం కొనసాగుతుందని చెబుతున్నారు. ఇది బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి, ఇన్‌ఫెక్షన్ తలెత్తటానికి అనువైన వాతావరణం కల్పిస్తుందని తెలియజేస్తున్నారు. మరోవైపు కణజాలం తిరిగి కోలుకునే ప్రక్రియ కూడా నిలిచిపోతుందని వెల్లడిస్తున్నారు. దెబ్బతిన్న కణజాలం లోతుల్లోకి ఆక్సిజన్ చేరకపోతే మరింత సమస్యంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. దీన్ని పరిష్కరించటానికే ఖజ= పరిశోధకులు కొత్త జెల్ వ్యవస్థను రూపొందించారు. మెత్తగా, మృదువుగా ఉండే ఇది గాయమైన భాగం వద్దే నిరంతరం నేరుగా ఆక్సిజన్‌ను సృష్టిస్తుందంటున్నారు పరిశోధకులు.

ఎలా పనిచేస్తుంది :

జెల్ పట్టీలో నీరు, కొలిన్ ఆధారిత ద్రవం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. యాంటీ బ్యాక్టీరియా గుణం గల కొలిన్ ఆధారిత ద్రవం సురక్షితమైందని, తనకు తానే క్షీణిస్తుందని అంటున్నారు. వినికిడి సాధనాల్లో ఉండేటువంటి చిన్న బ్యాటరీతో అనుసంధానమైనప్పుడు ఈ వ్యవస్థ చిన్న విద్యుత్ రసాయన పరికరంగా మారుతుందని పేర్కొంటున్నారు. అప్పుడు నీటి అణువులు విడిపోయి నెమ్మదిగా, అవసరమైనంత మేరకు ఆక్సిజన్ పుట్టుకొస్తూ ఉంటుందని వివరిస్తున్నారు. ద్రవాలను పీల్చుకునే లేదా యాంటీ మైక్రోబియల్ పదార్థాలతో కూడిన సంప్రదాయ పుండ్ల పట్టీల మాదిరిగా కాకుండా ఇది ఆక్సిజన్ లేమి సమస్యను పరిష్కరించటం ద్వారా పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. ముందుగా పుండు ఆకారాన్ని కచ్చితంగా మార్చి, ఆక్సిజన్ మోతాదులు తక్కువగా ఉన్నచోట పగుళ్లను పూడ్చివేస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్‌ఫెక్షన్ ముప్పు గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. నిరంతరం ఆక్సిజన్ సరఫరా కావటం వల్ల రక్తనాళాలూ త్వరగా పుట్టుకొస్తాయని, ఫలితంగా పుండు వేగంగా మానుతుందని సూచిస్తున్నారు.

ఆశాజనక ఫలితాలు :

వినూత్న జెల్ పట్టీని డయాబెటిస్ గల, వృద్ధ ఎలుకల మీద ప్రయోగించి, పరిశీలించారు పరిశోధకులు. ఎందుకంటే, వీటి పుండ్లు వృద్ధుల్లో తలెత్తే దీర్ఘకాల పుండ్లనే పోలి ఉన్నాయంటున్నారు. చికిత్స చేయకపోతే పుండు మానదని, ప్రాణాంతకంగానూ పరిణమిస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే, ఎలుకలకు వారానికి ఒకోసారి పట్టీని మార్చుతూ, సుమారు 23 రోజుల పాటు చికిత్స చేశారని వివరిస్తున్నారు. అన్నీ జీవించి ఉన్నాయని తెలియజేస్తున్నారు. తద్వారా పట్టీ మంచి ఫలితం చూపుతున్నట్టు దీని ద్వారా రుజువైందని చెబుతున్నారు. ల్యాబ్ లో కణజాలాలు, అవయవాలను వృద్ధి చేయటంలోనూ ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడటం కీలకమంటున్నారు. ఇలాంటి వాటికీ జెల్ పట్టీ ఉపయోగపడగలదని భావిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## మహిళా వైద్యులు, నర్సింగ్ అధికారులకు ఘన సన్మానం...



నాగర్‌కర్నూల్//**మార్చి 08 (ఆకాంక్ష) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో మహిళా వైద్యులు, నర్సింగ్ అధికారులకు ఘన సన్మానం నిర్వహించారు. ఆదివారం రోజున ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ అధికారులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వి. శేఖర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కుటుంబం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని అన్నారు. మహిళా సాధికారత దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మహిళలకు సమాన హక్కులు మరియు గౌరవం కల్పించడం సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు.మహిళలు విద్య, వైద్య, సామాజిక సేవ వంటి అనేక రంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ సమాజానికి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వారి సేవలను గుర్తించి సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సభ్యులు ఆవంచ సల్వా చారి, మంగి ఆంజనేయులు, వర్గాల భాను ప్రకాష్, ఆనంద్ సింగ్, బోనాసి రాజు, డాక్టర్ రోహిత్, ఆసుపత్రి హెడ్ నర్సులు, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## సనాతన ధర్మ పరిరక్షణ డివిజన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక...



నాగర్ కర్నూల్//**మార్చి 08 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సనాతన ధర్మ పరిరక్షణ అలయన్స్ కమిటీ డివిజన్ స్థాయి కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు వ్యవస్థాపక యోగ గురువు బీరెల్లి చంద్రారెడ్డి తెలిపారు.నాగర్ కర్నూలు డివిజన్ కమిటీ అధ్యక్షులుగా బాదం నరేందర్,ప్రధాన కార్యదర్శిగా ప్రతాపచారి, కోశాధికారిగా వేదవతి ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాము,ప్రశాంత్ రెడ్డి,శోభ,శీను, అనూష ,పద్మ, మహాలింగం, సరస్వతి ,అనురాధ ,వెంకటేష్ ఉప కార్యదర్శులుగా నాగరాజ్, మురళీమోహన్,శీను,సోషల్ మీడియా బాధ్యులుగా హెచ్. నందకిషోర్ లు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు తెలిపారు.ఈ డివిజన్ కమిటీ భవిష్యత్తులో ధర్మ పరిరక్షణ కోసం విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.

## మూగ మహిళను వేధించిన వ్యక్తికి గ్రామస్తుల బహిరంగ శిక్ష..



పాట్నా//**మార్చి 08 (ఆకాంక్ష) :** బీహార్ రాష్ట్రంలోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఒక మూగ మహిళను లైంగికంగా వేధించిన వ్యక్తికి గ్రామస్తులు బహిరంగంగా శిక్ష విధించిన ఘటన సంచలనం సృష్టించింది. అతడికి గుండు చేయించి గ్రామంలో ఊరేగిస్తూ అవమానించారు. అంతేకాకుండా రూ.5,001 జరిమానా కూడా విధించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం పోలీసుల దృష్టికి చేరింది.వివరాల్లోకి వెళ్తే ముజఫర్‌పూర్ జిల్లా ఔరై గ్రామానికి చెందిన ఒక మూగ మహిళను అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగికంగా వేధించినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న మహిళ కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు సమావేశమై ఈ విషయంపై చర్చించారు.సమావేశం అనంతరం ఆ వ్యక్తికి బహిరంగంగా శిక్ష విధించాలని నిర్ణయించారు. గ్రామస్తులు అతడికి గుండు చేయించి గ్రామంలో ఊరేగించారు. అదేవిధంగా రూ.5,001 జరిమానా విధించారు. ఈ ఘటనను కొందరు వీడియోగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది వేగంగా వైరల్ అయింది.వీడియో వైరల్ కావడంతో విషయం పోలీసుల దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిపై కూడా అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## శీర్షిక: మంజుల అనే నేను

అంశం అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**మార్చి 08 (ఆకాంక్ష) :** గాయాల్ని గుండెల్లో దాచుకుని గర్వంగా నవ్వడం నేర్చుకున్నాను! పడిపోతూ కూడా నిలబడటం నేర్చుకున్నాను! నిశ్శబ్దంగా కనిపించినా నిర్ణయాల్లో గర్జించే శక్తిని నేను! నేను మహిళను మాత్రమే కాదు మార్పుకు మొదటి అడుగు నేను! నన్ను ఆపాలని ప్రయత్నించిన చేతులుఇప్పుడు నా విజయానికి చప్పట్లు కొడుతున్నాయి! నన్ను ఆపాలని వచ్చిన చీకట్లు ఇప్పుడు నా వెలుగుకే దారి చూపించాయి! కన్నీరు పొంగిన ప్రతి క్షణం నా గుండెల్లో విప్లవం మేల్కొంటుంది! నన్ను ఆపాలని వచ్చిన ప్రతి మాట ఇప్పుడు నా విజయ గీతంగా మారుతోంది! నేను వంటింటి పొగ కాదు నిరాశలో ఉన్న మహిళా హృదయాలకు ఆశ నింపి వెలుగుజ్యోతిని వెలిగించాను! నన్ను అబల అని అన్న వారందరికీ సహనాన్ని ఆయుధంగా మార్చుకొని నాయకురాలిగా దారులు చూపించాను! ఇల్లు నుంచి దేశం వరకు ప్రతి రంగంలో వెలుగునిచ్చే ప్రతి మగువకు నా హృదయపూర్వక వందనాలు తెలుపుతూ... అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. శ్రీమతి మంజుల పత్తిపాటి (కవయిత్రి). మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్రం చరవాణి 9347042218

### ప్రాణాంతక గర్భాశయ క్యాన్సర్ నివారణకు

# ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం...

### రామగుండం నగర మేయర్,మహంకాళి స్వామి...




గోదావరిఖని//**మార్చి 08 (ఆకాంక్ష) :** ప్రాణాంతక గర్భాశయ క్యాన్సర్ నివారణకు 14 సంవత్సరాల వయస్సున్న బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని రామగుండం నగర మేయర్,మహంకాళి స్వామి అన్నారు.ఆదివారం గోదావరి ఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో, రీజినల్ మెడికల్ ఆఫీసర్ కృపాభాయ్ తో కలిసి ఆయన హ్యూమన్ పాపిలోమావైరస్ (హ్యూం) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ స్వామి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం లక్షలాది మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారినపడుతున్నందున, ప్రభుత్వ ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొని నివారణ చర్యల్లో భాగస్వాములు కావాలని గుర్తు చేశారు. బాలికల పాఠశాలలు మరియు ఇతర విద్యాసంస్థల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించటం, 14 సంవత్సరాల వయసు అందించిన ప్రతీ బాలికకు వ్యాక్సిన్ అందించడం ముఖ్యమని ఆయన సూచించారు. అలాగే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని, మహిళాదినోత్సవం సందర్భంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాళ్ సింగ్, స్థానిక కార్పొరేటర్లు సాగి సంతోష్, రావు, వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం, ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ఇంటర్నేషనల్, వీవ్ లవ్ యుఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 895వ వరల్డ్ వైడ్ బ్లడ్ డ్రైవ్ ను మేయర్ మహంకాళి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా, వీవ్ లవ్ యుఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవలను ఆయన కొనియాడారు మరియు రక్తదాతలను అభినందించారు. ఈ బ్లడ్ డ్రైవ్‌లో 50 మంది దాతలు రక్తం దానంగా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు మరియు స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రతినిధి ప్రేమ్ దాస్ కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రామగుండంద మహిళా ఆరోగ్య పరిరక్షణ, రక్తదానంపై అవగాహన పెంపొందించడంలో ప్రతికూలత తగ్గింది అని అధికారులు తెలిపారు.

### వట్టెం గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల

## సేవలు మూడవ రోజు కొనసాగింపు..



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 08 (ఆకాంక్ష)** : నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక వేసవి శిబిరం మూడవ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. మండల పరిధిలోని పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్)ఎన్ఎస్ఎస్ యూనిట్1 మరియు యూనిట్2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామాభివృద్ధి కార్యక్రమాలలో విద్యార్థులు భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డా. సి. నాగరాజు మరియు శివ దొడ్డ పర్యవేక్షించారు.శిబిరంలో భాగంగా వట్టెం గ్రామంలోని చెరువు కట్ట వద్ద ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కంపచెట్లు, ముళ్లపొదలను తొలగించడం, చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచడం, నీటి నిల్వలకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు సమిష్టిగా పనిచేసి గ్రామ పర్యావరణ పరిరక్షణలో సక్రమ సేవలు అందించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి. జ్యోతి శంకర్, ఉపసర్పంచ్ వి. వినీత్ గౌడ్ హాజరై విద్యార్థులను అభినందించారు. యువత సమాజ సేవలో భాగస్వాములు కావడం ఆనందకరం అని, ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవతత్వం, సామాజిక బాధ్యత పెంపొందుతుందని చెప్పారు.ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు విద్యార్థులు గ్రామాల్లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా భవిష్యత్తులో కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తారని, ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ డా. పి. రాములు, అధ్యాపకులు యాదగిరి, మనోజ్ కుమార్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, యువత పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు...



నాగర్‌కర్నూల్//**మార్చి 08 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లాలో విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయిని శ్రీమతి ఎం.వి. జయమ్మ (84) గారిని ఆమె స్వగృహంలో ఘనంగా సన్మానించి, వారి సేవలను నాయకులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు.మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్లు పూర్తిగా అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.స్త్రీలను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధి సాధిస్తుందని వారు పేర్కొన్నారు. సమాజంలో మహిళలకు గౌరవం, అవకాశాలు కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా 50 ఏళ్ల క్రితమే ఉపాధ్యాయురాలిగా సేవలను ప్రారంభించి విద్యారంగానికి విశేషంగా సేవలందించిన ఎం.వి. జయమ్మ గారి సేవలను నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. వారి కృషి అనేక మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఎంతో కీలకంగా నిలిచిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటశెట్టి, పోలా శ్రీనివాసులు, యశోద, సంజీవ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా జయమ్మ గారిని పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

### కవయిత్రి, ఉపాధ్యాయిని సునీతా ప్రతాప్‌కు ఘన సన్మానం...




నాగర్‌కర్నూల్//**మార్చి 08 (ఆకాంక్ష) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూలు జిల్లాలో కవయిత్రి, ఉపాధ్యాయిని సునీతా ప్రతాప్‌ను ఘనంగా సత్కరించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ చేతుల మీదుగా సునీతా ప్రతాప్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ మహిళలు విద్యా, సాహిత్య రంగాలలో విశేష ప్రతిభ కనబరుస్తూ సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయినిగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ, సాహిత్య రంగంలో కూడా ప్రతిభ చూపుతూ అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్న సునీతా ప్రతాప్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో ఆమె చేసిన కృషి ప్రశంసనీయమని తెలిపారు. అదే సమయంలో సాహిత్యరంగంలో కవిత్వం ద్వారా సమాజంలోని సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా రచనలు చేస్తున్నారని అన్నారు. మహిళలు తమ ప్రతిభతో అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల విద్యాధికారులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొని సునీతా ప్రతాప్‌ను అభినందించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెకు లభించిన ఈ సన్మానం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సన్మానానికి స్పందించిన సునీతా ప్రతాప్ మాట్లాడుతూ తాను చేస్తున్న సేవలను గుర్తించి సత్కరించిన జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్‌తో పాటు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు, తోటి ఉపాధ్యాయినులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధి కోసం, సాహిత్య సేవ కోసం తన వంతు కృషిని కొనసాగిస్తానని ఆమె పేర్కొన్నారు.

# గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ రక్షణ కవచం...

### పెద్దపల్లిలో టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు...

### జిల్లా ఆస్పత్రిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు...





పెద్దపల్లిటౌన్//**మార్చి 08 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణ లక్ష్యంగా ప్రవేశ పెట్టిన హెచ్‌పీవీ (హ్యూం) సింగిల్ డోస్ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఆదివారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ సంజన అనే బాలికకు వైద్యుల సమక్షంలో టీకా వేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ 14 నుండి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలు భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైందని, పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో రాబోయే మూడు నెలల పాటు ఈ టీకా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అర్హులైన బాలికలు తమ ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలతో పాటు తల్లిదండ్రుల సమ్మతితో ఆసుపత్రికి వచ్చి ఈ టీకా వేయించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా ఆసుపత్రి అభివృద్ధిపై కూడా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుతం 50 పడకలతో ఉన్న జిల్లా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సహకారంతో మరో ఎనిమిది నెలల్లో నూతన భవనాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆసుపత్రి వైద్య సిబ్బంది, మహిళా సోదరీమణులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సమాజ అభివృద్ధికి మూలస్తంభమని, మహిళ లేనిదే సృష్టి లేదని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూడా మహిళా నాయకురాళ్లతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేను జిల్లా ఆసుపత్రి వైద్య బృందం శాలువాతో ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్ ముస్తాన్ నాజ్ నయ్యర్, జిల్లా విద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, మున్సిపల్ కౌన్సిలర్లు, వైద్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### పెద్దపల్లి జిల్లాలో మార్కెట్ స్థలాల రక్షణకు

# గొర్రెల కాపరుల సన్నద్ధం...

### ఈ నెల 10న రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయాలని పిలుపు...

### సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్...



పెద్దపల్లిటౌన్//**మార్చి 08 (ఆకాంక్ష) :**పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొర్రెలు, మేకల మార్కెట్ యార్డ్‌లో ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మార్కెట్ స్థలాల రక్షణ లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ తెలిపారు.మార్కెట్ స్థలాలు మనమే కాపాడుకుందాం' అనే నినాదంతో జరగనున్న ఈ చర్చా వేదికలో మార్కెట్ యార్డ్‌ల పరిరక్షణ, గొర్రెలుమేకల వ్యాపారానికి అవసరమైన సౌకర్యాల ఏర్పాటు, మార్కెట్ స్థలాలపై వస్తున్న సమస్యల పరిష్కారంపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు,గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, గొర్రెలు మరియు మేకల పెంపకందారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సలేంద్ర రాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్ మాట్లాడుతూ మార్కెట్ స్థలాల పరిరక్షణ కోసం గొర్రెల కాపరులు ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్ యార్డ్‌లను కాపాడుకోవడం ద్వారా పశుపోషకుల జీవనాధారం మరింత బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు.మార్కెట్ స్థలాల పరిరక్షణకు సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ చర్చా వేదికలో సమస్యలు, పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు.

## అక్రమ సంబంధం వివాదంతో భూక్య మోహన్ హత్య...

### వేములవాడ లాడ్జిలో హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు...

### హత్యకు ఉపయోగించిన బైక్, తాడు, చాకు స్వాధీనం...

### కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన డీఎస్పీ...




వేములవాడ//**మార్చి 08 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని సిద్ధార్థ కాంప్లెక్స్‌లో జరిగిన భూక్య మోహన్ హత్య కేసును వేములవాడ పట్టణ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం వేములవాడ అంజనీనగర్ ప్రాంతానికి చెందిన బైరి శారద అలియాస్ కళ్యాణి అనే మహిళ స్థానికంగా నర్సుగా పని చేస్తోంది. ఆమెకు మృతుడు భూక్య మోహన్‌తో కొంతకాలంగా అక్రమ సంబంధం ఉన్నట్లు విచారణలో బయటపడింది. ఈ సంబంధాన్ని ఆసరాగా చేసుకుని మోహన్ తరచూ డబ్బులు ఇవ్వాలని శారదను వేధించడమే కాకుండా, వారిద్దరూ కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలను బయటపెడతానని బెదిరింపులకు దిగినట్లు పోలీసులు తెలిపారు.ఈ వేధింపులు తట్టుకోలేక శారద తన భర్త బైరి శేకర్‌తో కలిసి మోహన్‌ను హత్య చేయాలని పథకం రచించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ పథకాన్ని అమలు చేయడానికి గుండం రవి అలియాస్ రవీందర్ అనే వ్యక్తి సహాయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 4వ తేదీన శారద పథకం ప్రకారం మోహన్‌ను వేములవాడలోని సిద్ధార్థ కాంప్లెక్స్ లాడ్జికి పిలిపించింది.అక్కడికి చేరుకున్న అనంతరం శారద భర్త శేకర్, గుండం రవి కలిసి మోహన్‌ను నైలాన్ తాడుతో గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఘటన స్థలం నుంచి నిందితులు పరారైనట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసిన వెంటనే నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు తిప్పాపూర్ బస్ స్టాండ్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన బైక్, నైలాన్ తాడు మరియు చాకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన వేములవాడ టౌన్ సీఐ వీర ప్రసాద్, ఎస్ఐలు రామ్మోహన్, ప్రేమానందం, పోలీసు సిబ్బంది ఇమ్రాన్, సల్మాన్, శ్రీనివాస్‌లను వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.

## వీణవంకలో పెద్ద చెరువులో నీరులేక చేపల మృతి

### 300 మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి ముప్పు...



వీణవంక//**మార్చి 08 (ఆకాంక్ష) :** కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలోని పెద్ద చెరువులో సరిపడా నీరు లేక చేపలు భారీగా చనిపోతున్నాయని వీణవంక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ చెరువులో నీటి కొరత తీవ్రమవడంతో మత్స్య సంపద నాశనమవుతోందని తెలిపారు.వేసవి కాలం ప్రారంభమవుతుండటంతో చెరువులో నీటి మట్టం రోజురోజుకూ తగ్గిపోతుండగా, గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో చేపలు పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితి మత్స్యకార కుటుంబాలను తీవ్రంగా కలవరపెడుతోందన్నారు.గత మూడు సంవత్సరాలుగా చెరువులో నీటి సమస్యపై ఇరిగేషన్ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని నాయకులు విమర్శించారు. చెరువులోని నీటిని కొందరు అక్రమంగా తరలించడం వల్ల కూడా నీటి మట్టం వేగంగా తగ్గిపోతోందని వారు ఆరోపించారు. వీణవంక పెద్ద చెరువుపై ఆధారపడి సుమారు 300 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని పేర్కొన్నారు. చెరువులో చేపలు చనిపోతే వారి కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమంగా నీటిని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పైప్రాంతాల నుండి చెరువుకు నీటిని విడుదల చేయాలని మత్స్యకారులు కోరారు. అధికారులు చొరవ తీసుకొని వెంటనే నీటిని తెప్పిస్తే చెరువులో మిగిలిన చేపలను కాపాడే అవకాశం ఉందన్నారు.అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే 300 మత్స్యకార కుటుంబాలు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వీణవంక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మోటం వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి రాయిశెట్టి కుమారస్వామి, డైరెక్టర్లు చుక్కల రవీందర్, రాయిశెట్టి రవి, రాము, ఓదెలు, సభ్యులు రాయిశెట్టి సంపత్, గుర్రం కొమురయ్య, సదానందం, రమేష్, మోహన్, సమ్మయ్య, శ్రీనివాస్, మొగిలి, వెంకటేశ్వర్లు, రాజయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడిని విడుదల చేయాలని మొబైల్ టవర్ ఎక్కిన ప్రియురాలు...

### ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత టవర్ నుంచి దిగిన మహిళ...

### గోపాల్‌గంజ్‌లో జరిగిన ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్...



బీహార్//**మార్చి 08 (ఆకాంక్ష) :**బీహార్ రాష్ట్రంలోని గోపాల్‌గంజ్ జిల్లాలో ప్రేమికుడిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఓ మహిళ మొబైల్ టవర్ ఎక్కిన సంఘటన సంచలనం రేపింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న తన ప్రియుడిని వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేస్తూ టవర్‌పైకి ఎక్కి ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పోలీసుల వివరాల ప్రకారం, గోపాల్‌గంజ్ జిల్లా బంకట జాగిర్దారి గ్రామానికి చెందిన ఓ మహిళ అదే గ్రామానికి చెందిన పవన్ చౌహాన్ అనే యువకుడితో కొంత కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది.



అయితే మార్చి 5వ తేదీన ఆ మహిళ ఆకస్మికంగా అదృశ్యమవడంతో ఆమె కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పవన్ చౌహాన్ ఆమెను కిడ్నాప్ చేశాడని భావించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పవన్ చౌహాన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇదే విషయం తెలుసుకున్న ఆ మహిళ తీవ్ర ఆవేశానికి గురై సమీపంలో ఉన్న మొబైల్ టవర్‌పైకి ఎక్కింది. తన ప్రియుడిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, విడుదల చేయకపోతే టవర్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మహిళను కిందికి దిగేందుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే ఆమె ఎలాంటి మాట



వినకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసులు అదుపులో ఉన్న పవన్ చౌహాన్‌ను సంఘటనా స్థలానికి తీసుకువచ్చి ఫోన్ ద్వారా ఆమెతో మాట్లాడించారు.ప్రియుడితో మాట్లాడిన అనంతరం ఆ మహిళ శాంతించి టవర్ నుంచి కిందికి దిగింది. దీంతో అక్కడున్న పోలీసులతో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని ఇద్దరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనపై తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. కాగా సినిమా సన్నివేశాన్ని తలపించిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మహిళలకు ఘన సన్మానం...




నాగర్‌కర్నూల్//**మార్చి 08 (ఆకాంక్ష) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఘనసన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలను సన్మానించారు.ఈ సందర్భంగా కాళ్ల నిరంజన్ మాట్లాడుతూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ప్రతి పురుషుని జీవితంలో మహిళ పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. మనకు జన్మనిచ్చేది తల్లి అనే మహిళ అని, మన మొదటి గురువు కూడా తల్లేనని ఆయన పేర్కొన్నారు. చిన్నతనంలో మనతో కలిసి పెరిగే అక్క, చెల్లి వంటి తోబుట్టువులు కూడా మన జీవితంలో ఎంతో ప్రేమ, ఆనందాన్ని అందిస్తారని చెప్పారు.అలాగే ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి పెళ్లి అనే బంధంతో జీవితాంతం మనతో పాటు ఉండి కుటుంబ బాధ్యతలను తీసుకునే భార్య కూడా మహిళేనని ఆయన తెలిపారు. మన బాధలను చెప్పకుండానే అర్థం చేసుకుని మనకు తోడుగా నిలిచేది కూతురు అని పేర్కొన్నారు. మహిళలు మన జీవితంలో తల్లి,అక్క,చెల్లి, భార్య, కూతురు రూపాల్లో అనేక బాధ్యతలను నిర్వర్తిస్తూ కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు.పూర్వ కాలంలో మన పూర్వీకులు మహిళలను ఎంతో గౌరవంతో చూసేవారని, “ఆడదే ఆధారం”, “ఇంటికి ఇల్లాలే దీపం”, “ఆడదే ఆదిశక్తి” అంటూ మహిళల విలువను గుర్తించేవారని ఆయన గుర్తుచేశారు. భార్యను అర్ధనారీశ్వరి భావనతో గౌరవించేవారని తెలిపారు. కుటుంబంలో తోబుట్టువుల బాధ్యతలను కూడా పురుషులు పంచుకునేవారని అన్నారు.అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని, మనీపై విలువలను పెంచి మహిళలపై విలువలను తగ్గిస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ద్వారా రాజకీయ రిజర్వేషన్లు, ఉద్యోగ రిజర్వేషన్లలో మహిళలకు స్థానం కల్పించినప్పటికీ వారికి సముచిత గౌరవం అందడం లేదని అన్నారు.గతంలో సినీ రంగంలో కుటుంబ కథా చిత్రాలు నిర్మించి కుటుంబ విలువలను పెంపొందించే ప్రయత్నం చేసేవారని, ఇప్పుడు అలాంటి చిత్రాలు తగ్గిపోయాయని ఆయన వ్యాఖ్యానించారు. టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో సీరియళ్లు కూడా కుటుంబ విలువలను పెంపొందించే విధంగా ఉండాలని సూచించారు.అలాగే గతంలో రాజకీయాల్లో విలువలు ఉండేవని, ప్రత్యర్థి నాయకులను కూడా గౌరవించుకునే సంప్రదాయం ఉండేదని చెప్పారు. ప్రజలపై అధిక భారం పడకుండా పాలన సాగించేవారని తెలిపారు. ఇప్పుడు ఆ విలువలు తగ్గిపోతున్నాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను ఎంతో గౌరవించేవారని, ప్రస్తుతం టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో ఆ విలువలు తగ్గుతున్నాయని ఆయన అన్నారు. సమాజం మారితేనే మహిళలకు నిజమైన గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు.స్త్రీలను గౌరవించాలంటే ముందుగా మనమే మారాలని, మన ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చి తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు, రక్తసంబంధీకులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరిని గౌరవించాలనే భావన పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళలను గౌరవించి పూజించాలనే సంస్కృతి పెంపొందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, బీసీ మహిళా నాయకురాలు మరియు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## 90 ఏళ్ల వృద్ధురాలిపై నలుగురు వ్యక్తుల సామూహిక అత్యాచారం...




భోపాల్//మార్చి 08 (ఆకాంక్ష) : మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మానవత్వాన్ని కలవరపరిచే ఘోర సంఘటన వెలుగు చూసింది. ఖాండ్వా జిల్లాలో 90 ఏళ్ల వృద్ధురాలిపై నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర సంచలనం రేపింది. గ్రామ పరిసరాల్లోని పొలంలో గుడిసెలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని ముసుగులు ధరించిన నలుగురు దుండగులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖాండ్వా జిల్లా పరిధిలోని ఒక గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు తన పొలంలోని చిన్న గుడిసెలో ఒంటరిగా నివసిస్తోంది. మార్చి 5వ తేదీ రాత్రి సమయంలో ముసుగులు ధరించిన నలుగురు వ్యక్తులు అక్కడికి వచ్చి వృద్ధురాలిపై దాడి చేశారు. ఆమెను బెదిరించి అమానుషంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వృద్ధురాలి అరుపులు గ్రామానికి దూరంగా ఉన్న కారణంగా ఎవరికి వినిపించలేదు.దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలతో బాధపడుతున్న వృద్ధురాలు రాత్రంతా గుడిసెలోనే ఉండిపోయింది. మరుసటి రోజు సమీప గ్రామంలో నివసిస్తున్న తన కుమార్తెకు జరిగిన దారుణాన్ని ఆమె వివరించింది. విషయం తెలుసుకున్న కుమార్తె వెంటనే అక్కడికి చేరుకుని తల్లిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది.ఆసుపత్రిలో వైద్యులు వృద్ధురాలికి చికిత్స అందించారు. లైంగిక దాడి కారణంగా ఆమెకు గాయాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఆసుపత్రి సిబ్బంది సూచన మేరకు బాధితురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనపై జిల్లా పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశారు. నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయడానికి మూడు ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించారు. నిందితుల గురించి సమాచారం అందించిన వారికి రూ.10,000 నగదు బహుమతిని కూడా ప్రకటించినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. గ్రామ పరిసరాల్లో అనుమానితుల కదలికలపై పోలీసులు గమనిస్తున్నారు. సీసీ కెమెరాలు, స్థానికుల సమాచారం ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఇంత వృద్ధురాలిపై కూడా దారుణానికి పాల్పడిన ఘటన స్థానిక ప్రజలను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. మహిళల భద్రతపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పోలీసులు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఎన్నికలు అడ్డుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం...

మంత్రి వివేక్ కుట్రలతో క్యాతనపల్లి చైర్మన్ ఎన్నికలు వాయిదా...

బీఆర్ఎస్‌సీపీఐకి మెజార్టీ ఉన్నా చైర్మన్ ఎన్నికలు జరగనివ్వడం లేదు...

హైకోర్టు ఆదేశాల మేరకు మూడు వారాల్లో చైర్మన్ ఎన్నికలు జరపాలి...

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్...




మంచిర్యాల//మార్చి 08 (ఆకాంక్ష) : మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ ఎన్నికల అంశం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ సీపీఐ కూటమికి మున్సిపాలిటీలో స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ చైర్మన్ ఎన్నికలు జరగకుండా కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తోందని ఆయన విమర్శించారు.ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన బాల్క సుమన్ క్యాతనపల్లి మున్సిపాలిటీలో గత నెల 16, 17 తేదీల్లో జరగాల్సిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికలను ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించేలా మంత్రి వివేక్ కుట్రలు పన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికలు జరగకుండా కాంగ్రెస్ నాయకులు అనేక రకాల ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన అన్నారు. మున్సిపాలిటీలో బీఆర్ఎస్ సీపీఐ కూటమికి మెజార్టీ ఉన్న విషయం స్పష్టంగా తెలిసినా కూడా అధికార దుర్వినియోగంతో ఎన్నికలను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఉద్రిక్త పరిస్థితులపై కూడా బాల్క సుమన్ స్పందించారు. కాంగ్రెస్ నాయకులు తమపై రాళ్ల దాడులకు పాల్పడ్డారని, అయితే పోలీసులు ఆ ఘటనలో నిజాలను పక్కనబెట్టి తామే తప్పు చేసినట్లుగా అక్రమ కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని ప్రయత్నించిన తమపై కేసులు పెట్టడం అన్యాయమని అన్నారు.తమను జైలుకు పంపించడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసానందంగా భావించిందని బాల్క సుమన్ విమర్శించారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత కూడా పోలీసులు వేధింపులు ఆపడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండతో పోలీసులు తమపై నిరంతరం ఒత్తిళ్లు తెస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు.కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ రామకృష్ణాపురం పోలీస్ స్టేషన్‌కు హాజరైనట్లు బాల్క సుమన్ తెలిపారు. చట్టాన్ని గౌరవించే వారిగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు మాత్రం రాజకీయ లాభాల కోసం పరిస్థితులను ఉద్రిక్తంగా మారుస్తున్నారని ఆరోపించారు. చెన్నూరు నియోజకవర్గానికి మంత్రి వివేక్ ఎన్నో హామీలు ఇచ్చారని, అయితే వాటిలో చాలా ఇప్పటికీ అమలు కాలేదని బాల్క సుమన్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోవడం ప్రజలను మోసం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. ఇక క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై హైకోర్టు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని బాల్క సుమన్ తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు మూడు వారాల్లోపే క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో జరగాలని అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని బాల్క సుమన్ పేర్కొన్నారు. మెజార్టీ ఉన్నప్పటికీ ఎన్నికలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నికలు త్వరగా నిర్వహించాలని ఆయన మరోసారి డిమాండ్ చేశారు.ఈ వ్యవహారం జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారగా, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నిర్వహణపై తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా వైద్య సిబ్బందికి ఘన సన్మానం..



కాల్వశ్రీరాంపూర్//మార్చి 08 (ఆకాంక్ష) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో డాక్టర్‌గా సేవలందిస్తున్న శ్రీచందనతో పాటు సిబ్బంది రజిత, నరసమ్మ తదితరులను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన గోపగోని సారయ్య గౌడ్ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కుటుంబంతో పాటు ఉద్యోగ రంగంలోనూ మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. మహిళలకు సమాజంలో మరింత గౌరవం, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రంగంలో మహిళలు రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వారు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.మహిళా దినోత్సవం సందర్భంగా వారికి శాలువాలు కప్పి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు బంగారి రమేష్, జిన్నా రామచంద్ర రెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఎనగంటి రవి, మాజీ సర్పంచ్ మాదాసు సతీష్, నాయకులు జనగామ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. మహిళా సిబ్బందిని అభినందిస్తూ పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## అనాథ మృతదేహానికి సర్పంచ్ చేతుల మీదుగా దహన సంస్కారాలు...

మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం...



మహబూబాద్//మార్చి 08 (ఆకాంక్ష) : మహబూబాద్ జిల్లా బయ్యారం మండలంలో మానవత్వాన్ని చాటిచెప్పే ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అనాధగా జీవనం సాగించిన ఓ వృద్ధురాలి మృతదేహానికి గ్రామ సర్పంచ్ స్వయంగా దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని ప్రదర్శించారు.మండల కేంద్రంలోని కాకతీయ నగర్‌కు చెందిన ముత్యాల సత్యమ్మ అనే వృద్ధురాలు గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవనం సాగిస్తోంది. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఆమెకు తిండి, దాహం చూసుకునే వారు కూడా లేక ఒంటరిగా గడుపుతోంది. దాదాపు ఇరవై రోజులుగా సరైన ఆహారం, సంరక్షణ లేక తీవ్ర అస్వస్థతకు గురైన సత్యమ్మ ఆదివారం మృతి చెందింది.ఈ విషయం గమనించిన కాలనీ వాసులు వెంటనే బయ్యారం గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సర్పంచ్ వెంటనే స్పందించి మృతదేహాన్ని పంచాయతీ ట్రాక్టర్‌లో తీసుకువెళ్లి శ్మశానవాటికకు తరలించారు. అక్కడ స్వయంగా దగ్గరుండి సత్యమ్మకు దహన సంస్కారాలు నిర్వహించారు.ఎవరూ లేని అనాధకు కుటుంబ సభ్యుడిలా వ్యవహరించి చివరి సంస్కారాలు నిర్వహించడం గ్రామస్థుల హృదయాలను తాకింది. సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ చేసిన ఈ మానవతా సేవను కాలనీ వాసులు, స్థానిక ప్రజలు అభినందించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సమాజంలో మానవత్వం ఇంకా జీవించి ఉందని ఈ ఘటన మరోసారి నిరూపించిందన్నారు. అనాధగా మృతి చెందిన వృద్ధురాలికి గౌరవప్రదంగా చివరి సంస్కారాలు నిర్వహించడం నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు.గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతను మించి మానవతా విలువలను నిలబెట్టిన సర్పంచ్ చర్యకు స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. సమాజంలో ఇలాంటి సేవా భావం పెరగాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

## ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు...



తిమ్మాపూర్//మార్చి 08 (ఆకాంక్ష) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలోని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్ఎండీ ఎస్సై సయ్యద్ అన్వర్ మహిళా పోలీసు సిబ్బందిని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, పోలీస్ శాఖలో కూడా పురుష పోలీసులతో సమానంగా మహిళా పోలీసులు విధులు నిర్వహిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. కష్ట సమయంలో ధైర్యంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.పోలీస్ శాఖలో మహిళల పాత్ర రోజు రోజుకూ పెరుగుతోందని, బాధ్యతాయుతంగా పనిచేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీసులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు మరింత ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం ఇవ్వకపోతే నల్లచెరువు ప్రారంభాన్ని అడ్డుకుంటాం...

బీఆర్ఎస్ నేత పాటిమీది జగన్ హెచ్చరిక...




హైదరాబాద్//మార్చి 08 (ఆకాంక్ష) : కూకట్ పల్లి ప్రాంతంలో చెరువుల ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లను కూల్చివేసిన ప్రభుత్వం బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించకపోతే నల్ల చెరువు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభాన్ని అడ్డుకుంటామని బీఆర్ఎస్ నాయకుడు పాటిమీది జగన్ హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కూకట్‌పల్లి గ్రామ పరిధిలో వందలాది మంది పేదల భూములను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా స్వాధీనం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. బాధితులకు నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. హైడ్రా అధికారిగా వ్యవహరిస్తున్న రంగనాథ్ ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. వెంటనే బాధితులకు కంపెన్సేషన్‌తో పాటు టీడీఆర్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్యల కారణంగా కూకట్‌పల్లికి చెందిన 52 సంవత్సరాల బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఆ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బుచ్చమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల కూల్చివేతల వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నల్లచెరువు అభివృద్ధి పనుల్లో సుమారు 80 శాతం పూర్తయ్యాయని పాటిమీది జగన్ పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్, గ్రీన్ బెల్ట్, ఓపెన్ ఎయిర్ జిమ్, పార్క్, ఆట స్థలం నిర్మాణాలు ఇప్పటికే చేపట్టినట్లు చెప్పారు. ఇప్పుడు కొన్ని చిన్నపాటి మెరుగులు దిద్ది మొత్తం అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.అదే విధంగా బీఆర్ఎస్ పాలనలో దుర్గం చెరువు , మల్కామ్ చెరువు , ఐడీఎల్ లాకే ఫ్రంట్ వంటి ఎన్నో చెరువుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. ఆ సమయంలో ఒక్క ఇల్లు కూడా కూల్చలేదని, ప్రజల భూములు బలవంతంగా స్వాధీనం చేసుకోలేదని స్పష్టం చేశారు.ప్రస్తుతం జరుగుతున్న ఇళ్ల కూల్చివేతలపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు నష్టపరిహారం అందించాలని, లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని పాటిమీది జగన్ హెచ్చరించారు. ఈ అంశంపై త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

## వైభవంగా శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం...



వీణవంక//మార్చి 08 (ఆకాంక్ష) : .కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని గంగారం గ్రామంలో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. గ్రామ ప్రజలు, భక్తుల సమక్షంలో ఆలయ ప్రాంగణం భక్తిరసంతో నిండిపోయింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తాయి.ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమాలు శేషం వెంకటరమణా చార్యులు, చెరుకుపల్లి నిఖిల్ ఆచార్యుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలతో కొనసాగాయి. ఆదివారం ప్రధానంగా ఆలయ శిఖర ప్రతిష్ట, ధ్వజస్తంభ యంత్ర ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు హాజరై స్వామి వారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు ఘనంగా వేదమంత్రాలు పారాయణం చేస్తుండగా భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను వీక్షించారు. ఆలయ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ పింగిలి కోమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాసం రాజిరెడ్డి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ కార్యక్రమాలు సజావుగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నల్ల అంజిరెడ్డి లక్ష్మీ దంపతులు, రవీందర్‌రెడ్డి సరిత దంపతులు రూ.10 లక్షల విరాళం అందజేసి విగ్రహదాతలుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ప్రతిష్టాపన కార్యక్రమం అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధ్య, ఉపసర్పంచ్ హరీష్, వార్డు సభ్యులు కనకం అనిల్, నరేందర్, మాజీ సర్పంచ్ పుల్లూరి కుమార్, మాజీ ఎంపీటీసీ కాసం వీరారెడ్డి, దేవాలయ కమిటీ ఉపాధ్యక్షులు సంపత్‌రెడ్డి, కోశాధికారి కుమారస్వామి, సహాయకార్యదర్శి పుల్లూరి కుమార్, సలహాదారులు, కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, పురుషులు మరియు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రద్దీతో గంగారం గ్రామం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

## శివాజీ వంతెన వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి...



హైదరాబాద్//మార్చి 08 (ఆకాంక్ష) : హైదరాబాద్ నగరంలోని ఉస్మాన్‌షాహి శివాజీ వంతెన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉస్మాన్‌షాహి ప్రాంతానికి చెందిన ఈశ్వర్ సింగ్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం తన పని నిమిత్తం ఉస్మాన్‌షాహి నుంచి ఇమ్లిబన్ పార్క్ వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదం జరిగింది.అదే సమయంలో ఉస్మాన్‌షాహి శివాజీ వంతెన సిగ్నల్ వద్ద పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వస్తూ పాదచారిగా వెళ్తున్న ఈశ్వర్ సింగ్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఢీకొట్టడంతో అతను తీవ్రంగా గాయపడి రోడ్డుపైనే కుప్పకూలి పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఈశ్వర్ సింగ్‌ను వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ నాగేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు తెలిపారు.రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. ఈ ఘటనపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ శివాజీ వంతెన సిగ్నల్ వద్ద ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టం చేయాలని అధికారులను కోరుతున్నారు.ం

## పాలెం గ్రామంలో హైమాక్స్ లైట్ల ఏర్పాటు...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 08 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో గ్రామాభివృద్ధి దిశగా మరో ముందడుగు పడింది. గ్రామంలోని పలు ముఖ్య ప్రాంతాల్లో హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి ఆదివారం రాత్రి గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ ప్రారంభించారు. గ్రామంలోని ఐదవ, ఆరవ, రెండవ వార్డుల్లో రాత్రివేళల్లో చీకట్లు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలియజేయగా, అవసరమైన ప్రాంతాలను గుర్తించి హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ లైట్ల వల్ల గ్రామ వీధులు వెలుగులతో మెరిసిపోతాయని, రాత్రి సమయంలో పాదాచారులు, వాహనదారులకు సౌకర్యం కలుగుతుందని చెప్పారు. గ్రామంలోని మరుమూల ప్రాంతాల్లో కూడా త్వరలో లైట్లు ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కాశన్న, హేమలత, గౌస్య బేగం, గోవిందు, అరుణ, శంకర్, మాజీ ఎంపీపీ పుప్పాల శ్రీనివాస్ గౌడ్, పెద్ద కురుమయ్య, జంగం శ్రీకాంత్, మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ చర్యపై హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతి శనివారం భజన మండలి పోటీలు...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 08 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినాపల్లి మండల పరిధిలో ఉన్న శ్రీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ ఆధ్వర్యంలో ప్రతి శనివారం భజన మండలి పోటీలు నిర్వహిస్తున్నారు. శ్రీ బాలాజీ ఆధ్యాత్మిక సేవ సమితి పాలెం వారి ఆధ్వర్యంలో ప్రతి శనివారం రాత్రి 9:30 గంటల నుంచి భజన కార్యక్రమం జరుగుతోంది.ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా స్థాయిలోని భజన మండలి సభ్యులు పాల్గొనాలని దేవాదాయ శాఖ కమిటీ కోరింది. ఇప్పటికే వంకేశ్వరం, వనపర్తి, అచ్చంపేట, గుడ్లనర్వ, ఖానాపూర్, మంగానూర్ తదితర ప్రాంతాల భజన మండళ్లు పాల్గొంటూ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నాయి. ప్రతి శనివారం నిర్వహించే పోటీల్లో మొదటి బహుమతిగా రూ.2,000 అందజేస్తున్నారు. అలాగే గ్రామస్తులు తమ ఇష్టానుసారం సంవత్సరానికి రూ.2,000 చెల్లించవచ్చని ఆలయ కమిటీ తెలిపింది. ఈ నిధులను భజన కార్యక్రమాల సందర్భంగా వివాహ వార్షికోత్సవాలు, పుట్టినరోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో భజన మండళ్లకు అందజేయడానికి ఉపయోగిస్తామని పేర్కొన్నారు.ఈ శనివారం జరిగిన పోటీల్లో అచ్చంపేట భజన మండలి మొదటి బహుమతిని గెలుచుకుంది. కార్యక్రమంలో గాడి సురేందర్, మురళి, శెట్టి సుప్పరి నర్సింహ, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి బుచ్చన్న, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ముమ్మరంగా అండర్ డ్రైనేజ్ పనులు...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 08 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలోని గుడ్ల, పాలెం గ్రామాల్లో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రామాల్లో అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ లేట్ల బాలస్వామి పనులను ప్రారంభించి పరిశీలించారు.గ్రామాల్లో మురుగు నీరు వీధుల్లో నిల్వ ఉండకుండా ఉండేందుకు ఈ అండర్ డ్రైనేజ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన వీధులు, కాలనీలలో నీరు నిలిచి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఇది శాశ్వత పరిష్కారంగా మారుతుందని పేర్కొన్నారు. డ్రైనేజ్ నిర్మాణంతో గ్రామంలో పరిశుభ్రత మెరుగుపడడంతో పాటు దోమలు, వ్యాధులు తగ్గుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పాలెం గ్రామంలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త, ప్లాస్టిక్ కవర్లను ట్రాక్టర్ల ద్వారా తొలగిస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.

## ఇంటాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిమోఫిలియా రోగులకు ఉచిత ఫ్యాక్టర్ పంపిణీ...




కరీంనగర్//మార్చి 08 (ఆకాంక్ష) : కరీంనగర్ జిల్లాలో హిమోఫిలియా బాధితులకు సహాయం అందించేందుకు ఇంటాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం కరీంనగర్‌లోని సిటీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో హిమోఫిలియా లబ్ధిదారులకు ఉచితంగా ఫ్యాక్టర్ పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లాలోని హిమోఫిలియా రోగులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారికి అవసరమైన వైద్య సహాయం అందించారు. కార్యక్రమంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వెంకట్ రెడ్డి పాల్గొని హిమోఫిలియా వ్యాధి గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. హిమోఫిలియా అనేది అరుదైన జన్యు సంబంధ రక్త రుగ్మత అని ఆయన తెలిపారు. ఈ వ్యాధి ఉన్న వ్యక్తులకు చిన్న గాయం జరిగినా కూడా రక్తం సరిగా గడ్డకట్టకపోవడం వల్ల తీవ్ర సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని వివరించారు. హిమోఫిలియా రోగులకు అవసరమైన ఫ్యాక్టర్ మందులను సరైన సమయంలో ఉపయోగించడం ద్వారా రక్తస్రావాన్ని నియంత్రించవచ్చని డాక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు స్వయంగా ఫ్యాక్టర్ వయల్స్‌ను ఎలా ఇన్ఫ్యూజ్ చేసుకోవాలో ప్రాయోగికంగా చూపించి వారికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ద్వారా రోగులు తమ ఆరోగ్యాన్ని తామే సంరక్షించుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన అన్నారు.ఈ శిబిరంలో మొత్తం 58 మంది హిమోఫిలియా లబ్ధిదారులకు 116 ఫ్యాక్టర్ ఎ××× వయల్స్‌ను ఉచితంగా అందజేశారు. అదేవిధంగా ఫ్యాక్టర్ అస్సే పరీక్ష కోసం 42 మంది రోగుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ పరీక్షల ద్వారా రోగుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి తగిన చికిత్స అందించేందుకు వైద్యులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఇంటాస్ ఫౌండేషన్ ప్రతినిధులు సుజాత, శివ కుమార్, లహరి కార్యక్రమంలో పాల్గొని హిమోఫిలియా రోగులకు అవసరమైన వైద్య మద్దతు అందించారు. రోగులకు అవసరమైన చికిత్సతో




పాటు ప్రాణాలను రక్షించే స్వీయ సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించడంలో తమ సంస్థ ఎప్పటికీ ముందుంటుందని తెలిపారు.హిమోఫిలియా వంటి అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వైద్యులు పేర్కొన్నారు. రోగులు ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్తలు పాటిస్తూ సమయానికి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని హిమోఫిలియా బాధితులకు ఉపశమనం కలిగిందని పాల్గొన్న వారు తెలిపారు.

## డాక్టర్ సృజనను సత్కరించిన కలెక్టర్ బాదావత్ సంతోష్...



నాగర్ కర్నూల్//మార్చి 08 (ఆకాంక్ష) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పిపి యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ సృజనను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఘనంగా సత్కరించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ మహిళలు ఓర్పు, సహనం కలిగి ఉండి జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ విజయాలను సాధించే గొప్ప మనోబలాన్ని కలిగి ఉంటారని అన్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అపారమని, వారి సహనం మరియు ధైర్యం ప్రగతికి సోపానాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళల ఉనికే ప్రపంచానికి వెలుగులాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలో మహిళలకు గౌరవం, మర్యాదలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. మహిళలపై ఏ విధమైన అవమానాలు, అన్యాయాలు చోటు చేసుకోకుండా సమాజంలోని ప్రతి వర్గం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పిపి యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ సృజనకు శాలువా కప్పి సత్కరించారు. అలాగే మహిళా నర్సింగ్ ఆఫీసర్ వనిత, ఆశా వర్కర్ లక్ష్మీ లను కూడా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి నాయక్, జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శేఖర్, జిల్లా టీకా అధికారి డాక్టర్ సురేష్ బాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ భరత్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు కృష్ణమోహన్, ప్రదీప్, మాస్ మీడియా అధికారి రాజగోపాల్ ఆచారి, ఓ శ్రీను, రేనయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉదండాపూర్ నిర్వాసితులకు రూ.338 కోట్ల పరిహారం...




జడ్చర్ల//మార్చి 08 (ఆకాంక్ష) : మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కింద పెంచిన మొత్తాలతో కలిపి రూ.338 కోట్ల పరిహారం చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లో నిర్వాసితులకు అందజేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఇచ్చిన విధంగానే ఉదండాపూర్ నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లను కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలని తాము కోరినట్లు పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని జలసౌధలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్‌పై నిర్వహించిన అధికారిక సమీక్షా సమావేశంలో ఈ అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఉదండాపూర్ నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని రూ. 18 లక్షలకు పెంచిన నేపథ్యంలో అదనంగా రూ.146 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని గుర్తుచేశారు. పెంచిన పరిహారంతో కలిపి ప్రస్తుతం నిర్వాసితులకు ఇంకా రూ.338 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లోనే నిర్వాసితులకు అందజేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. గతంలో మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు జివో నంబర్ 1 ద్వారా కేటాయించిన ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇచ్చినట్లుగానే ఉదండాపూర్ నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లను కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో కూడా ఇప్పటికే చర్చించినట్లు చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ నిర్వాసితులకు సరైన న్యాయం జరగలేదని అనిరుధ్ రెడ్డి విమర్శించారు. భూములు లేని వారికి కూడా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పరిహారాలు చెల్లించారని, ఇళ్లు లేని వారికీ ఉన్నట్లుగా రికార్డులు తయారు చేసి పరిహారం ఇవ్వాలని జాబితాలు రూపొందించారని ఆరోపించారు. ప్రస్తుతం రీ సర్వే నిర్వహించి అర్హులైన నిర్వాసితులను గుర్తించామని తెలిపారు. భూములు లేకుండానే దొంగ డాక్యుమెంట్ల ద్వారా పరిహారం పొందిన వారిపై చర్యలు తీసుకుంటూ ఆర్ అండ్ ఆర్ చట్టం కింద నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఇళ్లు లేకపోయినా జాబితాలో ఉన్న అనర్హుల పేర్లను తొలగించామని తెలిపారు. కొంతమంది నిర్వాసితులు కోర్టును ఆశ్రయించిన విషయం కూడా తమ దృష్టికి వచ్చిందని, వారితో మాట్లాడి వారికి రావాల్సిన పరిహారాన్ని కూడా అందరితో పాటు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఉదండాపూర్ ప్రాజెక్ట్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిర్వాసితుల సమస్యలపై ఎమ్మెల్యే లేవనెత్తిన అంశాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

## మహిళలు సాధించుకున్న హక్కుల రక్షణకై పోరాడాలి...

### సీనియర్ న్యాయవాది శైలజ...



గోదావరిఖని//మార్చి 08 (ఆకాంక్ష) : మహిళలు సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి నిరంతరం పోరాటం కొనసాగించాలని సీనియర్ న్యాయవాది, ఏఐఎల్యూ రాష్ట్ర మహిళ కన్వీనర్ సీహెచ్ శైలజ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని శ్రామిక భవన్‌లో ఐద్వా, సిఐటియు, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యుయు, డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఏ. మహేశ్వరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ న్యాయవాది శైలజ మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా దాని వెనుక ఉన్న గొప్ప పోరాట చరిత్రను సమాజానికి, ముఖ్యంగా యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు పని చేసే రంగాల్లో సముచిత వేతనం, భద్రత, కనీస మౌలిక సదుపాయాలు, సమాన హక్కుల కోసం సాగించిన పోరాటాల ఫలితంగానే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం రూపుదిద్దుకుందని గుర్తు చేశారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ పనిస్థలాల్లో సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఆధునిక సమాజంలో సీరియల్స్, సినిమాల్లో మహిళలను మహిళలకే శత్రువులుగా చూపిస్తూ వారి గౌరవాన్ని కించపరచే విధంగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. సావిత్రిబాయి పూలే, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరవనితల పోరాటాలు, త్యాగాల స్ఫూర్తితోనే మహిళలు తమ హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. అంతరిక్షం నుంచి సైనిక రంగం వరకు మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ. మహేశ్వరి, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఏ. జ్యోతి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొంటు సాగర్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ దేశంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ కొందరు నాయకులు మహిళలను వంటింటికే పరిమితం చేయాలని వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులకు ప్రధాన కారణమవుతున్న మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు పనిచేసే ప్రదేశాలు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల్లో భద్రత కల్పించేలా కఠిన చట్టాలు రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, డీవైఎఫ్ఐ గోదావరిఖని పట్టణ కార్యదర్శి అట్ల శివకుమార్, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు అనూష, సృజన, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గోదావరిఖనిలో మహిళా అధికారి, సిబ్బందికి సత్కారం..

### వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు...



గోదావరిఖని//మార్చి 08 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా పోలీస్ అధికారిణులు, సిబ్బందికి ఘనంగా సత్కారం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మహిళా పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో మహిళా అధికారిణులు, సిబ్బంది విధుల్లో చూపుతున్న నిబద్ధత, ధైర్యసాహసాలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజల రక్షణ కోసం పగలు రాత్రి తేడా లేకుండా కర్తవ్యనిర్వహణలో ముందుండి సేవలు అందిస్తున్న మహిళా పోలీసులకు సమాజం కృతజ్ఞతలు తెలపాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీస్ అధికారిణులు, సిబ్బందిని సన్మానిస్తూ వారికి శిల్డులు, గిఫ్ట్‌లు అందజేశారు. మహిళల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తించేలా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగి మహిళా సిబ్బందికి ప్రోత్సాహాన్నిచ్చింది.

## 14 సంవత్సరాల బాలికలందరూ హెచ్‌పీవీ టీకా తీసుకోవాలి...

### నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్...







నాగర్‌కర్నూల్,//మార్చి 08 (ఆకాంక్ష) : మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు 14 సంవత్సరాలు నిండిన బాలికలందరూ తప్పనిసరిగా హెచ్‌పీవీ (హ్యూం) టీకా తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ బదావత్ సంతోష్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు వచ్చే క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రెండవ అతిపెద్ద క్యాన్సర్‌గా గుర్తించబడిందన్నారు. ఈ వ్యాధిని ముందుగానే నివారించేందుకు హెచ్‌పీవీ టీకా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జిల్లాలో మార్చి 31 వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రాంతీయ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో మాత్రమే 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకాలు అందజేస్తామని చెప్పారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ టీకా పూర్తిగా సురక్షితమైనదని, బాలికల భవిష్యత్తుకు రక్షణ కవచంలా పని చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. కాబట్టి తల్లిదండ్రులు తమ 14 సంవత్సరాలు నిండిన కుమార్తెలకు తప్పకుండా హెచ్‌పీవీ టీకా వేయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా హెచ్‌పీవీ టీకా ప్రచార పోస్టర్లు, పాఠశాల ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య సేవలు అందిస్తున్న వైద్యులు, నర్సింగ్ అధికారులను కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. అలాగే ఆశా కార్యకర్తలకు యూనిఫాం చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్, జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శేఖర్, పీడియాట్రిషన్ డాక్టర్ రోహిత్, జిల్లా టీకాకరణ అధికారి డాక్టర్ సురేష్ బాబు, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కృష్ణమోహన్, నాగర్‌కర్నూల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ సృజన, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి, డీపీఓ రేనయ్య, పర్యవేక్షకులు వై.శ్రీనివాసులు, సుకుమార్ రెడ్డి, కోట్ర నిరంజన్, డి. కుమార్, మరియమ్మ, నర్సింగ్ ఆఫీసర్ వనిత, ఏఎన్ఎంలు నర్సింగమ్మ, జీజే కవిత, సరస్వతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రాంతీయ మహిళా రైతు సదస్సు నిర్వహణ...







నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 08 (ఆకాంక్ష) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఆదివారం "ప్రాంతీయ మహిళా రైతు సదస్సు"ను ఘనంగా నిర్వహించారు. మహిళా రైతుల సాధికారత, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా రైతులకు వివిధ పంటల రకాలపై, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేయడానికి అవసరమైన శాస్త్రీయ విధానాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. పంటల దిగుబడులు పెంచే ఆధునిక సాంకేతిక పద్ధతులు, పంటల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయంలో కొత్త విధానాల వినియోగంపై శాస్త్రవేత్తలు వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాడసిద్ధప్ప, శాస్త్రవేత్త (సేద్య విభాగం) మాట్లాడుతూ పంటలపై మోతాదుకు మించి రసాయనాల వినియోగం చేయడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. అధికంగా రసాయనాలు వాడటం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడం, పంటల నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. అందువల్ల రైతులు శాస్త్రీయంగా సూచించిన మోతాదులోనే ఎరువులు, రసాయనాలు వినియోగించాలని సూచించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మశ్రీ మాట్లాడుతూ వేరుశనగ పంటలో అనుసరించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల ఎంపిక నుండి కోత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయానికి ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, పురుగు నియంత్రణ వంటి అంశాలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శంకర్ (సస్యరక్షణ విభాగం) యాసంగి పంటల్లో వచ్చే చీడపీడల నివారణపై సమగ్రంగా వివరించారు. పంటలకు వచ్చే పురుగులను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకుంటే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. రైతులు రసాయనాలపై మాత్రమే ఆధారపడకుండా సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు శాస్త్రవేత్తల మధ్య చర్చా గోష్ఠి నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లగా, వారు వాటికి తగిన పరిష్కార మార్గాలను సూచించారు. రైతుల సందేహాలకు సమాధానాలు ఇస్తూ పంటల నిర్వహణలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలను వివరించారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన కేంద్రం పాలెం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్. కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలో మహిళా రైతుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మహిళలు వ్యవసాయ రంగంలో మరింతగా ముందుకు రావాలని, వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ వంటి రంగాల్లో కూడా మహిళలు భాగస్వామ్యం కావాలని సూచించారు. మహిళా రైతులు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి వ్యవసాయానికి అనుబంధ కార్యకలాపాలను చేపడితే అదనపు ఆదాయం పొందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అలాగే వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా కూలీల కొరతను తగ్గించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో భాగంగా అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం ఉత్తమ మహిళా రైతులను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులు సత్కరించారు. ఈ సదస్సులో సుమారు 300 మంది రైతులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి...

### రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పిలుపు...




గోదావరిఖనిటౌన్//మార్చి 08 (ఆకాంక్ష) : ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్‌ను ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్స్‌లో ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలనప్రగతి ప్రణాళికను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని స్థానిక శాసనసభ్యులు కృతనిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. అందువల్ల విధుల పట్ల అలసత్వం ప్రదర్శించకుండా సానిటేషన్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని, మెప్మా ఆర్‌పీలు ఇంటింటా ప్రచారం నిర్వహించాలని సూచించారు. కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అయినప్పటికీ నిబంధనలు పాటించకుండా చెత్తను బయటపడవేసే వారికి రూ.500 జరిమానా విధించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్స్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని మేయర్ మహంకాళి స్వామి స్వయంగా వడ్డించారు. అనంతరం భీమునిపట్నం, ఆటోనగర్ ప్రాంతాల్లో పర్యటించి మురుగు నీటి కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశీలించారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి కాలువల్లో చెత్త పడవేసే వారిని గుర్తించి జరిమానాతో పాటు నల్లా కనెక్షన్ తొలగించడం వంటి కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తదుపరి మేడిపల్లి అన్నపూర్ణ కాలనీలో రోడ్డు వెడల్పు పనులలో భాగంగా ఉన్న శిధిలాలను పరిశీలించారు. శిధిలాలను వెంటనే తొలగించడంతో పాటు రోడ్డుమధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. అనంతరం గౌతమీనగర్‌లోని డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్, కంపోస్ట్ యార్డ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా డంపర్ ప్లేసర్, కంపోస్ట్ తయారీ యంత్రాలు మరమ్మత్తులు లేక నిరుపయోగంగా ఉన్నాయని గుర్తించి వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. కంపోస్ట్ యార్డ్‌ను పునరుద్ధరించి తడి చెత్తను రీసైక్లింగ్ చేసి మొక్కల పెంపకానికి ఉపయోగపడే ఎరువుగా తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నట్లు చెప్పారు. రెండవ డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్, డంపింగ్ యార్డ్ నిర్మాణ దశలో ఉన్నందున వీలైనంత త్వరగా పూర్తి చేసి నగరంలో సేకరించే చెత్తలో 80 శాతానికి పైగా రీసైక్లింగ్ చేసే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువీర్, టీపీఎస్ నవీన్, ఏఈలు జమీల్, మీర్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, వార్డు అధికారులు, మెప్మా సీఓ శ్వేత, ఆర్‌పీలు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

## శ్రామిక మహిళల ఉపాధిపై దాడికి వ్యతిరేకంగా పోరాడుదాం...

### కోడిపుంజుల జ్యోతి పిలుపు...




గోదావరిఖని//మార్చి 08 (ఆకాంక్ష) : శ్రామిక మహిళల ఉపాధిపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు మహిళలు ఐక్యంగా పోరాటాలు చేపట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి పిలుపునిచ్చారు. మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకుని పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలోని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పి.ఓ.డబ్ల్యూ జిల్లా నాయకురాలు మాదుగుల రజిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోడిపుంజుల జ్యోతి మాట్లాడుతూ మార్చి 8 అనేది మహిళలు తమ సమస్యలపై పోరాడేందుకు స్ఫూర్తి పొందిన రోజు అని పేర్కొన్నారు. పోరాటాల ద్వారానే మహిళలు తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళా కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటాలను స్మరించుకుంటూ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. 1910లో కమ్యూనిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించాలని ప్రతిపాదించగా, అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభ ఆ ప్రతిపాదనను ఆమోదించినట్లు గుర్తు చేశారు. అనంతరం 1975లో ఐక్యరాజ్య సమితి కూడా అధికారికంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించిందని వివరించారు. మోడి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో కార్మికులు, రైతులు, మహిళల సమస్యలు మరింతగా పెరిగాయని ఆమె విమర్శించారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాలలో సమాన వేతనాలు ఇవ్వాల్సి వస్తుందని భావించి ఉద్యోగాలను కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ అసంఘటిత రంగంగా మార్చుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అన్ని రంగాలలో పురుషాధిక్యత కొనసాగుతోందని, ముఖ్యంగా అసంఘటిత రంగంలో మహిళా కార్మికులపై వివక్ష, వేధింపులు, హింసలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉపాధి భద్రత కల్పించాలని, పని హక్కును అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. మహిళలు, పిల్లల అక్రమ రవాణాను అరికట్టాలని, మద్యం మరియు మాదక ద్రవ్యాల ప్రభావాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని అన్నారు. నీలి చిత్రాల ప్రాచుర్యాన్ని అరికట్టాలని కూడా ప్రభుత్వాన్ని కోరారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. భూమిపై హక్కు, స్వయం నిర్ణయ హక్కు, లైంగిక హింసకు వ్యతిరేకంగా మహిళలు పోరాటాలను మరింత బలపరచాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజి రాంజీ పథకాన్ని వెనక్కి తీసుకొని, ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి పని దినాలను పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఓ.డబ్ల్యూ జిల్లా నాయకులు ఈ. మంగ, కుందారపు శారద, బి. లక్ష్మి, ఉప్పు అనసూర్య, మేరుగు పద్మ, కోడిపుంజుల సత్తక్క, పైడిపల్లి అమృతమ్మ, నాడెం రాజక్క, బైరెడ్డి కమల, బొంతు సరస్వతి, ఇసంపల్లి లావణ్య, సౌజన్య, శంకరమ్మ, దుర్గమ్మ, లత, సంధ్య, ప్రమీల, రాజమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఈదునూరి నరేష్, బి. అశోక్, మేరుగు చంద్రయ్య, పైడిపల్లి రమేష్, కొల్లూరి మల్లేష్, అరుముల్ల తిరుపతి, బండి అశోక్, దూలం సతీష్, వార్డు సభ్యులు మాలం తిరుపతి, ఆరుముల్ల సృజన్, నాయకులు బొంతు ఆనంద్, ఈదునూరి బాబు, ఇ. తిరుపతి, ఎన్. రమేష్, పి. జనార్ధన్, ఈ. అంజి, ఇసంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.